# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 275 శనివారం 4 మే 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


## బీఆర్ఎస్ చచ్చిన పాము..

# బీజేపీ అబద్దాల పుట్ట



- గుజరాత్ వాళ్లే మనుషులా... తెలంగాణ వాళ్లు కాదా?
- ప్రధాని మోదీపై రేవంత్ రెడ్డి ఆగ్రహం
- గుజరాత్‌కు లక్షల కోట్లు తరలిస్తున్నారని ఆరోపణ
- దేశ అభివృద్ధికి పీవీ ఆర్థిక సంస్కరణలే కారణమని వ్యాఖ్య
- కాంగ్రెస్ రిజర్వేషన్లు పెంచాలని చూస్తే బీజేపీ రద్దు చేయాలని చూస్తోంది
- రాహుల్ గాంధీ ప్రధాని అయితే రిజర్వేషన్లు ఎక్కడకూ పోవు
- బీజేపీకి 400 సీట్లు వస్తే మాత్రం రాజ్యాంగాన్ని మారుస్తుంది

ధర్మపురి

బీఆర్ఎస్ చచ్చిన పాము... బీజేపీ అబద్ధాల పుట్ట అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గుజరాత్‌కు ప్రధాని మోదీ లక్షల కోట్లు తరలిస్తున్నారని... అక్కడి వారే మనుషులా, తెలంగాణ వాళ్లు కాదా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మపురి కాంగ్రెస్ జనజాతర సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... ఇందిరాగాంధీ, సోనియా గాంధీ ప్రాతినిథ్యం వహించిన రాయ్‌బరేలి నియోజకవర్గం నుంచి రాహుల్ గాంధీ నామినేషన్ వేశారని... ఈ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనడం తనకు సంతోషంగా ఉందన్నారు. పీవీ నర్సింహారావు ప్రధానిగా చేసిన ఆర్థిక సంస్కరణలే దేశ అభివృద్ధికి కారణమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ టార్గెట్‌గా -మిగతా2లో



## దేశాన్ని లూటీ చేసేందుకే అధికారం కోసం కాంగ్రెస్ తహతహ

- ప్రధాని నరేంద్ర మోదీ
- వారు ఏం ముఖం పెట్టుకుని మీ ముందుకొస్తున్నారు
- దేశాన్ని యదేచ్ఛగా దోచుకునేందుకే వారు ఢిల్లీలో కొలువుతీరాలని కోరుకుంటున్నారు
- 2014కు ముందు వారు దేశానికి చేసిందేమీ లేదని, దేశాన్ని దోచుకున్నారు

## కేంద్రంలో రాబోయేది సంకీర్ణ ప్రభుత్వామే



- కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు
- 14 నుంచి 15 సీట్లు గెలిస్తే.. సింగరేణిని కాపాడుకుంటాం
- బీఆర్ఎస్ బలంగానే ఉంటేనే కాంగ్రెస్ పార్టీ వాగ్దానాలు నెరవేరుస్తది
- బీఆర్ఎస్ ఎంపీల గెలుపులోనే తెలంగాణ గెలుపు ఉంది
- బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కై తనను నిలువరించారు
- 48 గంటల పాటు తనపై నిషేధం విధించి గొంతు నొక్కారని ఆగ్రహం
- నేను బస్సు యాత్ర ప్రారంభించాక కాంగ్రెస్, బీజేపీ నేతల గుండెలు వణుకుతున్నాయ్: కేసీఆర్

రామగుండం

ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో రాబోయేది సంకీర్ణ ప్రభుత్వమే అని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి 200 సీట్లు వచ్చే పరిస్థితి లేదని వార్తలు వస్తున్నాయని కేసీఆర్ తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని రామగుండంలో నిర్వహించిన -మిగతా2లో

## రికార్డు స్థాయిలో టెంపరేచర్

- సరికొత్త రికార్డులు సృష్టిస్తున్న ఉష్ణోగ్రతలు
- ప్రతి రోజు 44 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- ముఖ్యంగా ఉత్తర భారతంలో వీస్తున్న వేడిగాలుల తీవ్రత
- దేశంలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదు
- ఈ ఏడాది ఏప్రిల్ నెలలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు
- పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా 103 సంవత్సరాల రికార్డులు బద్దలయ్యాయి



హైదరాబాద్

ఈ ఏడాది ఉష్ణోగ్రతలు సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. 44 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో జనాలను బయటికి రావద్దని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఉత్తర భారతంలో వీస్తున్న వేడిగాలుల తీవ్రతకు దేశంలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. -మిగతా3లో

## ఐదు నెలల్లోనే రేవంత్ రెడ్డి అవినీతి మార్క్ పాలన

- తెలంగాణలో మార్పు వచ్చిందని చెబుతున్న ముఖ్యమంత్రి... ఏం మార్పు వచ్చిందో చెప్పాలని ప్రశ్న
- తెలంగాణలో కేవలం కల్వకుంట్ల కుటుంబ పాలన పోయి సోనియా గాంధీ కుటుంబ పాలన వచ్చిందని విమర్శ
- రేవంత్ రెడ్డి హామీలు ఇచ్చి ఇప్పుడు గాడిద గుడ్డు ఇస్తున్నారని ఎద్దేవా



## ఎన్నికల కారణంగా కేజ్రీవాల్ బెయిల్ అంశాన్ని పరిశీలిస్తాం

- "కోర్టు బెయిల్ ఇస్తుందని ఇరువర్గాలు ఊహించవద్దు
- బెయిల్ ఇవ్వచ్చు, ఇవ్వకపోవచ్చు
- మే 7న పిటిషన్‌ను విచారిస్తాం
- ఢిల్లీ సీఎంకు తాత్కాలిక బెయిల్ ఇస్తే అమలు చేయాల్సిన షరతులతో ఈడీ మా ముందుకు రావాలి
- ప్రస్తుతం జైలులో ఉన్న ఆయన బెయిలు కోసం చేసుకున్న అభ్యర్థన సుప్రీంకోర్టు పరిశీలనలో ఉంది.



# మొహువా మొయిత్రితో కలిసి స్టెప్పులు వేసిన దీదీ

**కొల్‌కతా :** ఎన్నికల ప్రచారంలో భాగంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్టెప్పులు వేశారు. అందుకు సంబంధించిన వీడియో ఎక్స్‌లో వైరల్ అవుతుంది. గురువారం నడియా జిల్లాలోని తిహట్టాలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ (టీఎంసీ) మొహువా మొయిత్రికి మద్దతుగా సీఎం మమతా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మోదీ పాలనలో దేశంలో చోటు చేసుకుంటున్న పరిణామాలపై విమర్శలు గుప్పించారు. ఆ క్రమంలో యూనిఫార్మ్ సివిల్ కోడ్, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల హక్కులు ప్రమాదంలో పడతాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక మహిళలు, పార్టీ అభ్యర్థి మొహువా మొయిత్రితో కలిసి సీఎం మమతా బెనర్జీ కలిసి డ్యాన్స్ చేశారు. అందుకు సంబంధించిన వీడియోను టీఎంసీ అభ్యర్థి మొహువా మొయిత్రి తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తనకు మద్దతుగా ప్రచారం చేసినందుకు మమతాకు ఈ సందర్భంగా మొయిత్రి ధన్యవాదాలు తెలిపారు.



గతవారం మాల్డాలోని స్థానిక మహిళలతో కలిసి బెంగాలీ జానపద గీతాలను అనుగుణంగా సీఎం మమతా బెనర్జీ నృత్యం చేశారు. కృష్ణనగర్ లోక్‌సభ స్థానం నుంచి టీఎంసీ అభ్యర్థిగా మొహువా మొయిత్రి బరిలో దిగారు. గత ఎన్నికల్లో సైతం ఆమె ఇదే స్థానం నుంచి గెలుపొందారు. అయితే లోక్‌సభలో మొయిత్రి ప్రశ్నలు అడిగేందుకు బహుమతులు అందుకొందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో గతేడాది పార్లమెంట్‌లో ఎథిక్స్ కమిటీ విచారణ జరిపి.. ఆమెను లోక్ సభ నుంచి బహిష్కరించిన సంగతి తెలిసిందే.


**సందేశ్‌ఖాలీపై మాట్లాడటానికి ముందు..**

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పశ్చిమబెంగాల్ గవర్నర్ సీవీ ఆనందబోస్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు రావడంతో.. రాజ్‌భవన్‌లోనే మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మండిపడ్డారు. సందేశ్‌ఖాలీపై నెలల తరబడి అసత్య ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు దీనికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. సందేశ్‌ఖాలీపై తెగ మాట్లాడుతున్న ప్రధాని గవర్నర్ వ్యవహారంపై ఎందుకు నోరు తెరవడం లేదని మమతాబెనర్జీ ఫైర్ అయ్యారు. సందేశ్‌ఖాలీపై మాట్లాడేముందు రాజభవన్‌లో గవర్నర్‌పై వచ్చిన ఆరోపణలపై మాట్లాడాలన్నారు. గవర్నర్ తనను లైంగికంగా వేధించాడని బెంగాల్ రాజ్‌భవన్‌లో కాంట్రాక్టు ఉద్యోగినిగా పనిచేస్తున్న ఓ మహిళ ఆరోపించారు. ఈ ఆరోపణలు ఇప్పుడు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. గతంలో సందేశ్‌ఖాలీలో తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు షేక్ షాజహాన్‌పైన, టీఎంసీకే చెందిన ఇద్దరు జిల్లా పరిషత్ సభ్యులు ఉత్తమ్ సర్దార్, శిబూ హజ్రాపైన లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చాయి. మహిళలపై వారు ఇష్టారీతిగా అఘాయిత్యాలకు పాల్పడినట్లు పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో బీజేపీ నేతలు టీఎంసీపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ క్రమంలో సందేశ్‌ఖాలీపై మాట్లాడేందుకు గవర్నర్‌పై మాట్లాడాలని మమత మండిపడుతున్నారు.

# భారత్‌కు 'జోనోఫోబిక్'

## బైడెన్ షాకింగ్ కామెంట్స్

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంచలన కామెంట్స్ చేశారు. భారత్ తమ దేశంలోకి విదేశీ వలసదారులను అనుమతించేందుకు భయపడుతుందని తీవ్ర ఆరోపణలు చేశారు. అందుకే భారత్ వంటి దేశాల్లో ఆర్థిక అభివృద్ధి వేగంగా లేదని చురకలించారు. కాగా, వాషింగ్టన్‌లో పార్టీ నిధుల సేకరణ కార్యక్రమంలో జో బైడెన్ మాట్లాడుతూ.. భారత్, జపాన్, చైనా, రష్యా దేశాలపై విరుచుకుపడ్డారు. ఈ దేశాలు విదేశీ వలసదారులను తమ దేశంలోకి ఆహ్వానించేందుకు భయపడుతున్నాయి. అందుకే వాటి ఆర్థిక వ్యవస్థలు వేగంగా వృద్ధి చెందకుండా ఇబ్బంది పడుతున్నాయన్నారు. కానీ, అమెరికా విదేశీ వలసదారులను స్వాగతిస్తుందన్నారు. ఈ కారణంగానే వారు దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమయ్యేందుకు కృషి చేస్తుంటారని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో భారత్, జపాన్, చైనా, రష్యా దేశాలను 'జెనోఫోబిక్' (విదేశీయుల పట్ల విద్వేషం, భయం) దేశాలంటూ విమర్శించారు.



ఈ సందర్భంగా అమెరికాను హైలైట్ చేసే ప్రయత్నం చేశారు బైడెన్. అయితే, ఎన్నికల సందర్భంగా బైడెన్ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. అమెరికా మిత్ర దేశాలైన భారత్, జపాన్ గురించి బైడెన్ తక్కువ చేసి మాట్లాడం సరికాదని రాజకీయ విశ్లేషకులు మండిపడుతున్నారు. అలాగే, ఆయన వ్యాఖ్యలు అమెరికాలో ఉన్న భారతీయులపై ప్రభావం చూపిస్తాయంటున్నారు. మరోవైపు.. బైడెన్ వ్యాఖ్యలపై వైట్ హౌస్ వివరణ ఇచ్చింది. ఆయనకు ఆయా దేశాల పట్ల అమితమైన గౌరవం ఉందని పేర్కొంది. ఆయన వ్యాఖ్యలు విశాల దృక్పథంతో చేసినవని చెప్పుకొచ్చింది. బైడెన్ ఎంత గౌరవిస్తారో మా మిత్రదేశాలు, భాగస్వాములకు బాగా తెలుసు. ఆయన అమెరికా గురించి మాట్లాడుతూ.. వలసదారులు దేశానికి ఎంత కీలకమో, వారు ఆర్థిక వ్యవస్థను ఎలా బలోపేతం చేస్తారో చెప్పారు. ఈ వ్యాఖ్యలను విస్తృత అర్థంలో తీసుకోవాల్సి ఉంటుంది. జపాన్, భారత్‌తో మాకు బలమైన సంబంధాలున్నాయి. మూడేళ్లుగా వాటిని మరింత పటిష్ఠపర్చేందుకు కృషి చేశామని వైట్ హౌస్ అధికార ప్రతినిధి కరీన్ జీన్ పియర్ వివరించారు.

## ఆయన వారణాసికి ఎందుకు పారిపోయిండో.. రాహుల్‌గాంధీపై విమర్శలకు ఖర్గే కౌంటర్



కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీపై బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలకు హస్తం పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ప్రధాని నరేంద్రమోదీ సొంత రాష్ట్రాన్ని వదిలేసి వారణాసికి ఎందుకు పారిపోయాడని ప్రశ్నించారు. 'రాహుల్‌గాంధీ గురించి ప్రశ్నించే ముందు ఆయన (ప్రధాని మోదీ) తనకు తానుగా వారణాసికి ఎందుకు పారిపోయాడో అడగండి' అని మీడియా ప్రతినిధులకు ఖర్గే సూచించారు. రాహుల్‌గాంధీ ఈ లోక్‌సభ ఎన్నికల్లో కేరళలోని వాయనాడ్‌తోపాటు ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి బరిలో దిగుతున్నారు. వాయనాడ్‌లో ఇప్పటికే పోలింగ్ కూడా పూర్తికాగా ఇవాళ రాయ్‌బరేలీ నుంచి కూడా కాంగ్రెస్ హైకమాండ్ ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. దాంతో శుక్రవారం మధ్యాహ్నం ఆయన రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో ప్రధాని సహా బీజేపీ నేతలు రాహుల్‌గాంధీపై విమర్శలు గుప్పిస్తున్నా రు. రాహుల్‌గాంధీ అమేథీలో స్మృతి ఇరానీపై ఓడిపోతానన్న భయంతోనే గత ఎన్నికల్లో వాయనాడ్‌లో కూడా పోటీ చేసి గెలిచారని, ఈ ఐదేళ్లలో వాయనాడ్‌కు ఆయన చేసిందేమీ లేదని, అందుకే అక్కడ ఓటమి భయంతో ఇప్పుడు రాయ్‌బరేలీకి పారిపోయాడని ఎద్దేవా చేస్తున్నా రు. ఈ విషయాన్ని మీడియా ప్రతినిధులు ఖర్గే ముందు ప్రశ్నించగా ఆయన పైవిధంగా స్పందించారు.

# భయపడొద్దు, పారిపోవద్దు

**రాహుల్ నామినేషన్‌పై మోదీ**

**దుర్గాపూర్:** రాయబరేలి నుంచి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అభ్యర్థిత్వం ఖరారు కావడంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. అమేథీలో పోటీకి బయపడే ఆయన రాయబరేలి వైపు పరిగెత్తుతున్నారని వ్యాఖ్యానించారు. "ఎన్నికల్లో పాటీ చేయడానికి ఆ పార్టీ (కాంగ్రెస్) ప్రముఖ నేతలు భయపడుతున్నారని, ఆమె (సోనియాగాంధీ) పోటీకి దూరంగా వెళ్తున్నారని పార్లమెంటులో అప్పుడే చెప్పాను. ఆమె రాజస్థాన్ వెళ్లి అక్కడ నుంచి రాజ్యసభకు వచ్చారు. షెహజాదా (రాహుల్) వయనాడ్ సీటు కోల్పోనున్నారని, వయనాడ్‌లో పోలింగ్ పూర్తి కాగానే, ఆయన మరో సీటు వెతుక్కుంటారని జోస్యం చెప్పాను. అమేథీలో పోటీకి భయపడుతున్నందనే రాయబరేలి పారిపోతున్నారని చెప్పాను. ఎవరూ భయపడవద్దని వాళ్లు (కాంగ్రెస్) చెబుతుంటారు. భయపడ వద్దు, పారిపోవద్దు అని ఇవాళ వారికి నేను చెబుతున్నాను" అని పశ్చిమబెంగాల్‌లోని బర్ధమాన్‌లో శుక్రవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ మోదీ అన్నారు.



**రాహుల్ నామినేషన్**

అమేథీ, రాయబరేలి నుంచి కాంగ్రెస్ అభ్యర్థులుగా ఎవరు బరిలోకి దిగుతారనే సస్పెన్స్‌కు ఆ ఆపార్టీ శుక్రవారంనాడు తెరదించింది. రాయబరేలి అభ్యర్థిగా రాహుల్‌ను, అమేథి అభ్యర్థిగా గాంధీ కుటుంబం సన్నిహితుడు కిషోరి లాల్ శర్మ పేరును ప్రకటించింది. ఆ వెంటనే రాయబరేలి నుంచి రాహుల్ నామినేషన్ వేశారు. సోనియాగాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, రాబర్ట్ వాద్రా సమక్షంలో మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో రాహుల్ నామినేషన్ వేశారు. రాహుల్‌కు చారిత్రాత్మకంగా, భావోద్వేగాల పరంగా అమేథీ కంటే రాయబరేలి సురక్షిత నియోజకవర్గంగా పార్టీ అధిష్ఠానం సుదీర్ఘ మంతనాల అనంతరం తుది నిర్ణయానికి వచ్చింది. సోనియాగాంధీ సైతం ఇటీవల తన ఫేర్‌ఫెల్ మెసేజ్‌లో, సుదీర్ఘ కాలం రాయబరేలి నియోజకవర్గం తనతోనే ఉందని, తన కుటుంబానికి ప్రజలు వెన్నుదన్నుగా నిలిచారని కృతజ్ఞతలు తెలిపారు. వయోభారం, ఆరోగ్య సమస్యల కారణంగా తాను ఎన్నికల్లో పోటీ చేయడం లేదన్నారు.

## రాహుల్, లాలూ పేర్లు ఉన్నందుకు పోటీకి అనర్హులంటే ఎలా?

**న్యూఢిల్లీ:** ఎన్నికల్లో ఒకే పేరున్న వ్యక్తులు ఒకే చోట నుంచి పోటీ చేయకుండా నిషేధం విధించాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజనాల వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు శుక్రవారంనాడు తోసిపుచ్చింది. రాజకీయ నాయకుల పేర్లు ఉన్న వ్యక్తులు స్వతంత్రంగా పోటీ చేయకుండా తాము నిరోధించలేమని స్పష్టం చేసింది. ప్రముఖ నేతలు బరిలో ఉన్నప్పుడు వారి పేరుతో ఉన్న వ్యక్తులు పోటీ చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే అవకాశాలు ఉంటాయని, ఇలాంటి సందర్భాల్లో స్వల్ప తేడాతో ప్రముఖ నేతలు ఓడిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయని పిటిషనర్ సబు స్టీఫెన్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిల్‌లో వాదించారు. ఈ ధోరణని నిలువరించి, ఎన్నికలు స్వేచ్ఛగా సజావుగా జరిగేందుకు వీలుగా తగిన చర్యలు తీసుకునేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలివ్వాలని పిటిషనర్ కోరారు.



దీనిపై జస్టిస్ బీఆర్ గవాయ్ స్పందిస్తూ... "తల్లిదండ్రులే పేర్లను పెట్టినప్పుడు ఎన్నికల్లో పోటీకి పేర్లు ఎలా అడ్డంకి అవుతాయి? రాహుల్ గాంధీ అనో, లాలూ ప్రసాద్ యాదవ్ అనో పేర్లు పెడితే వారిని పోటీ చేయకుండా ఎలా నిలువరించగలుగుతాం? ఇది వ్యక్తులకున్న హక్కులను ఉల్లంఘించడమే అవుతుంది" అని అన్నారు. పిటిషనర్ తన వ్యాజ్యాన్ని ఉపసంహరించుకోవాలని కూడా ధర్మాసనం ఆదేశించింది.

## ఎన్నికల కారణంగా కేజ్రీవాల్ బెయిల్ అంశాన్ని పరిశీలిస్తాం



**న్యూఢిల్లీ:** ఎన్నికల కారణంగా ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు తాత్కాలిక బెయిల్ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని సుప్రీంకోర్టు శుక్రవారంనాడు పేర్కొంది. మే 7న పిటిషన్‌ను విచారిస్తామని తెలిపింది. వాదనలు వినిపించేందుకు సిద్ధమై రావాలని ఈడీ తరఫు న్యాయవాదులకు జస్టిస్ ఖన్నా, దీపంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. "కోర్టు బెయిల్ ఇస్తుందని ఇరువర్గాలు ఊహించవద్దు. బెయిల్ ఇవ్వచ్చు, ఇవ్వకపోవచ్చు. ఢిల్లీ సీఎంకు తాత్కాలిక బెయిల్ ఇస్తే అమలు చేయాల్సిన షరతులతో ఈడీ మా ముందుకు రావాలి" అని ధర్మాసనం పేర్కొంది. కేజ్రీవాల్ ముఖ్యమంత్రి హోదాలో ఏ ఫైళ్లపై తకం పెట్టవచ్చనే విషయాన్ని కూడా పరిశీలించాలని ఈడీకి సూచించింది. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో గత మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసింది. ప్రస్తుతం జైలులో ఉన్న ఆయన బెయిలు కోసం చేసుకున్న అభ్యర్థన సుప్రీంకోర్టు పరిశీలనలో ఉంది. లోక్‌సభ ఎన్నికల మందు కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేయడం సరికాదంటూ ఆయన తరఫున అభిషేక్ మను సింఘ్వి గత విచారణలో కీలక ప్రశ్న లేవనెత్తారు. దీనిపై సమాధానం ఇవ్వాలని ఈడీని సుప్రీంకోర్టు సైతం ఆదేశించింది.

## దేశాన్ని లూటీ చేసేందుకే అధికారం కోసం కాంగ్రెస్ తహతహ




అవినీతి, కుంభకోణాల్లో పట్టుబడినా కాంగ్రెస్, జేఎంఎం నేతలు సిగ్గులేకుండా ప్రజల ముందుకొస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వారు ఏం ముఖం పెట్టుకుని మీ ముందుకొస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రధాని మోదీ శుక్రవారం జార?ండ్‌లోని సింగ్భుమ్‌లో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజా సమస్యలు కాంగ్రెస్, జేఎంఎం నేతలకు పట్టవని అన్నారు. వారు ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఎందుకు తహతహలాడుతున్నారని మీరు అనుకుంటున్నారని ప్రశ్నించారు.. మీ మేలు కోసం పనిచేసేందుకని మీరు అనుకుంటే పొరపాటని అన్నారు. దేశాన్ని యదేచ్ఛగా దోచుకునేందుకే వారు ఢిల్లీలో కొలువుతీరాలని కోరుకుంటున్నారని విమర్శించారు. 2014కు ముందు వారు దేశానికి చేసిందేమీ లేదని, దేశాన్ని దోచుకున్నారని మండిపడ్డారు. వారి ప్రభుత్వంలో పట్టపగలే ఆదివాదీలను అంతమొందించారని అన్నారు. ఆదివాసీల్లో నేరస్తుల పట్ల భయాన్ని కల్పించాలని వారు కోరుకున్నారని చెప్పారు.

## యూపీ ఎన్నికల్లో సైకిల్‌దే జోరు.. దాన్నెవరూ ఆపలేరు : అఖిలేశ్ యాదవ్




ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో సైకిల్ (సమాజ్‌వాది పార్టీ ఎన్నికల గుర్తు) దే జోరని, దాన్ని ఎవరూ అడ్డుకోలేరని యూపీ మాజీ ముఖ్యమంత్రి, ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ధీమా వ్యక్తంచేశారు. గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అన్ని హామీలను బీజేపీ తుంగలో తొక్కిందని, ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆయన విమర్శించారు. రైతుల ఆదాయం రెండింతలు చేస్తామని హామీ ఇచ్చారని, పదేళ్లు పాలించినా రెండింతలు కాలేదని అఖిలేష్ యాదవ్ విమర్శించారు. దేశంలో పేదలకు రేషన్ కూడా సరిగా అందడం లేదని ఆరోపించారు. రైతుల పంట రుణాలను కూడా కేంద్ర ప్రభుత్వం మాఫీ చేయలేకపో తున్నదని, కానీ పారిశ్రామికవేత్తల రుణాలను మాత్రం మాఫీ చేస్తున్నదని ఎద్దేవా చేశారు. దేశంలో 80 శాతం యువత ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా మిగిలిపోయారని అఖిలేష్ యాదవ్ అన్నారు. ఏ పరీక్ష జరిగినా పేపర్‌లు లీకవుతున్నాయని ఆరోపించారు. వీటిలో దేనికి కూడా ప్రభుత్వం దగ్గర సమాధానం లేదని విమర్శించారు. యూపీలో ఈసారి సైకిల్‌దే జోరని, దాన్ని ఎవరూ ఆపలేరని ధీమా వ్యక్తంచేశారు.

## రాయ్‌బరేలి బరిలో రాహుల్.. కాషాయ పార్టీలో కలవరం : జైరాం రమేష్



యూపీలోని రాయ్‌బరేలి, అమేథి నియోజకవర్గాలకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించిన అనంతరం పార్టీ నిర్ణయాన్ని సీనియర్ నేత జైరాం రమేష్ సమర్థించారు. రాయ్‌బరేలి నుంచి రాహుల్ గాంధీని బరిలోకి దింపడం బీజేపీ ఆ పార్టీ మద్దతుదారులకు షాక్‌కు గురిచేసిందని వ్యాఖ్యానించారు. రాయ్‌బరేలి నుంచి రాహుల్ గాంధీ పోటీ చేస్తారనే వార్తలపై ఎంతో మందికి ఎన్నో అభిప్రాయాలున్నాయని, రాజకీయాల్లో, చెస్‌లో ఆయన ఎంతో అనుభవ మున్న ఆటగాడని మరవరాదని జైరాం రమేష్ అన్నారు. విస్తృత చర్చ అనంతరం భారీ వ్యూహం, ఎత్తుగడల్లో భాగంగా పార్టీ నాయకత్వం ఈ నిర్ణయాలు తీసుకుందని అన్నారు. ఈ నిర్ణయం బీజేపీ సహా దాని మద్దతుదారులను వణికిస్తోందని జైరాం రమేష్ ట్వీట్ చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ఉద్దేశిస్తూ అపర చాణుక్యుడిగా చెప్పుకునే బీజేపీ నేతకు ఇప్పుడెలా స్పందించాలో తెలియడం లేదని అన్నారు. రాయ్‌బరేలి చాలాకాలం గా ఇందిరా గాంధీ, సోనియా గాంధీల స్థానం మాత్రమే కాదని, ఇది వారసత్వం కాదని, ఇది బాధ్యత అని జైరాం రమేష్ వ్యాఖ్యానించారు. గాంధీ కుటుంబానికి అమేథి-రాయ్‌బరేలి మాత్రమే కాదని, ఉత్తరాది నుంచి దక్షిణాది వరకూ దేశమంతా కాంగ్రెస్‌కు పట్టుందని పేర్కొన్నారు.

# రికార్డు స్థాయిలో టెంపరేచర్

-మొదటి పేజి తరువాయి

ఆంధ్రప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్, ఒడిస్సా, ఉత్తర ప్రదేశ్ వంటి రాష్ట్రాలలో ఎండలు మండిపోతున్నాయి. వీటికి వడ గాలులు కూడా తోడు కావడంతో జనం నరకం చూస్తున్నారు. ఈ తరుణంలో సాధ్యమైనంతవరకు ప్రజలు ఇంటి వద్ద ఉండాలని.. అత్యవసరమైన పని ఉంటేనే బయటికి రావాలని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే ఈ రాష్ట్రాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. వచ్చే మూడు రోజుల్లో వడ గాడ్పుల తీవ్రత అధికంగా ఉంటుందని హెచ్చరించారు. ఇదే సమయంలో తెలంగాణ, కర్ణాటక, సిక్కిం రాష్ట్రాల్లో ఉష్ణోగ్రత అధికంగా ఉంటుందని.. వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.వాస్తవానికి ఈ ఏడాది ఏప్రిల్ నెలలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా 103 సంవత్సరాల రికార్డులు బద్దలయ్యాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడం.. వాతావరణంలో మార్పులను సూచిస్తున్నాయని అధికారులు అంటున్నారు. 1921 కంటే ముందు ఏప్రిల్ నెలలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడే ఆ స్థాయిలో ఉష్ణోగ్రత రికార్డయింది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో 44 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రత నమోదయింది. అయితే వచ్చే ఐదు రోజుల్లో ఈ వేడి మరింత పెరుగుతోందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.వాతావరణంలో సమూల మార్పులు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో తూర్పు, దక్షిణ భారతదేశంలో తీవ్రమైన వేడిగాలులు వీచే అవకాశం ఉంది. అంతేకాదు మే నెలలో గతం కంటే అధిక స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. పెరిగిన ఎండల వల్ల పలు ప్రాంతాల్లో వడదెబ్బ మరణాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో మండే ఎండల్లో బయటికి వెళ్లకపోవడమే మంచిదని అధికారులు చెబుతున్నారు. కేవలం ఇంటి వద్ద మాత్రమే ఉండాలని, ఏవైనా పనులు ఉంటే ఉదయం లేదా సాయంత్రం సమయంలో పూర్తి చేసుకోవాలని సూచిస్తున్నారు. ఎండ వేడిమి కి శరీరం నీరసానికి గురవుతుందని.. అలాంటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. పండ్ల రసాలు తాగాలని సూచిస్తున్నారు.



## మే సమ్మర్ గడిచేదెట్లా

**హైదరాబాద్ :** తెలంగాణలో ఎండల తీవ్రత అధికంగా ఉంది. ఎన్నడూ లేని విధంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటాయి. నల్లగొండ, ఖమ్మం వంటి ప్రాంతాల్లో నిన్న 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయినట్లు వాతావరణ శాఖ తెలిపింది. తెలంగాణలో ఎండల తీవ్రత కారణం గా ఎనిమిది మంది ఇప్పటి వరకూ మరణించారని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు వెల్లడిం చారు. ఎండల తీవ్రతతో పాటు వేడిగాలులకు కూడా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం ఏడు గంటల నుంచే తెలంగాణలో ఎండతీవ్రత ఎక్కువగా ఉంది. ప్రజలు బయటకు రావడానికే భయపడిపోతున్నారు. ఎండల తీవ్రత ఎలా ఉందంటే... నడిరోడ్డు మీద దోసె వేసేటంత స్థాయిలో ఎండల తీవ్రత ఉందంటే ఆశ్చర్యపోక తప్పదు. గత వందేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఎండల తీవ్రత ఈ ఏడాది ఎక్కువగా ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. రహదా రులన్నీ ఉదయం నుంచే బోసి పోయి కన్పిస్తున్నాయి. కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. హైదరాబాద్ నగరంలో రోడ్లన్నీ ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. సాయంత్రం నాలుగు గంటలు దాటిన తర్వాత మాత్రమే ప్రజలు బయటకు వచ్చేందుకు ఇష్టపడుతున్నారు. చిరు వ్యాపారులు కూడా ఉదయం ఆరు గంటలకే తమ దుకాణాలను తెరుస్తున్నారు. ఎవరైనా నిత్యావసర వస్తువులు, కూరగాయలు కొనుగోలు చేయాలంటే ఉదయం ఏడు గంటల లోపే బయటకు వచ్చి వెళుతున్నారని, అందుకే తాము కూడా వేళలను మార్చుకున్నామని తెలిపారు రాత్రి పూట కూడా ఉక్కపోత వీడటం లేదు. వేడి గాలులతో అనేక మంది ఇబ్బంది పడుతున్నారు. మే నెల గడిచేదెట్లా? అని ఆందోళన చెందుతున్నారు. అనేక మంది ఇప్పటికే వడదెబ్బ తగిలి ఆసుపత్రి పాలయ్యారు. మరికొందరు ఇంట్లోనే చికిత్స పొందుతున్నారు. తీవ్రమైన జ్వరంతో పాటు ఒళ్లునొప్పులు కూడా ఉంటుండటంతో వైద్యులను సంప్రదిస్తున్నారు. డీహైడ్రేషన్ కు గురి కాకుండా నీరు ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు కూడా సూచిస్తున్నారు. మే నెలలోకి ఎంటర్ అవడంతో ఎండలు మరింత ముందిరే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. అవసరమైతే తప్ప బయటకు ఎవరూ రావద్దని కూడా హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

# కేంద్రంలో రాబోయేది సంకీర్ణ ప్రభుత్వమే

-మొదటి పేజీ తరువాయి

రోడ్ షోలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. బీజేపీకి 200 సీట్లు రావు అని వార్తలు వస్తున్నాయి. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం రాబోతోంది. 14 నుంచి 15 సీట్లు గెలిస్తే.. సింగరేణిని కాపాడుకుంటాం. నదులును కాపాడుకునే అవకాశం ఉటుంది. బీఆర్ఎస్ ఎంపీ గెలుపులోనే తెలంగాణ గెలుపు ఉన్నది. అరచేతిలో వైకుంతం చూపించి ఆరు గ్యారెంటీలని చెప్పి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి కర్రుకాల్చి వాతపెట్టే సమయం వచ్చింది. బీఆర్ఎస్ బలంగానే ఉంటేనే కాంగ్రెస్ పార్టీ వాగ్దానాలు నెరవేరుస్తది. కాబట్టి విజ్ఞతతో ఆలోచించి బీఆర్ఎస్‌ను గెలిపించాలి. కొప్పుల ఈశ్వర్ నిస్వార్థపరుడు. కార్మిక లోకంలో బతికిన వ్యక్తి.. ఆయనను భారీ మెజార్టీతో గెలిపించాలని కేసీఆర్ కోరారు.

దళితబంధును బంద్ చేశారు. వారు ఏం పాపం చేశారు. మా ప్రభుత్వంలో లక్షా 30 వేల కుటుంబాలకు మంజూరు చేశాం. వారికి మేం డబ్బులు విడుదల చేస్తే వాటిని వాపస్ తీసుకున్నారు రేవంత్ రెడ్డి. ఈ ఎన్నికల్లో దళితులు ప్రతీకారం తీర్చుకోవాలి. బీఆర్ఎస్‌కు ఓటు వేసి చురుకు అంటించాలి. 2001లో జెండా ఎగురవేసి.. తెలంగాణ రావాలని ప్రాణాలు అడ్డం పెట్టి పోరాటం చేశాను. చావు నోట్లో తలకాయపెట్టి తెలంగాణ సాధించుకున్నాం. సాధించుకున్న తెలంగాణలో ప్రాజెక్టులు కట్టుకున్నాం. సింగరేణిని కాపాడుకున్నాం. పేదలను ఆదుకున్నాం. కానీ అక్రమాలు చేసిన కాంగ్రెస్ ఎక్కువ కాలం ఉండదు. మళ్లా రాబోయేది బీఆర్ఎస్ గవర్నమెంటే.. ప్రజల అండదండలతో మళ్లీ మనమే వస్తాం. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిస్తేనే తెలంగాణ హక్కులను కాపాడుకోగలుగుతాం. సింగరేణి మనది మనకు ఉంటది అని కేసీఆర్ స్పష్టం చేశారు.

**నా బస్సు యాత్రతో కాంగ్రెస్, బీజేపీ నేతల గుండెలు వణుకుతున్నాయి**

నా బస్సు యాత్రతో కాంగ్రెస్, బీజేపీ నేతల గుండెలు వణుకుతున్నాయని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. ఇద్దరు కుమ్మక్కై నన్ను నిలువరించాలని నా ప్రచారంపై నిషేధం విధించారు అని కేసీఆర్ తెలిపారు. 48 గంటల తర్వాత నిషేధించబడిన నా గొంతు మళ్లీ మాట్లాడుతుంది. నేను ఏం చేశానని నా గొంతును ఆపారు. ఎందుకు కోసం నా గొంతను నొక్కేశారు. ఈ రాష్ట్రంలో చేనేత కార్మికులకు ఆర్డర్లు ఇవ్వడం లేదని, గత ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్ల బిల్లులు చెల్లించడం లేదని, నేతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తే.. మీరు మొన్నటిదాకా దొబ్బితన్నది చాలాదా..? అని కాంగ్రెస్ నాయకుడు మాట్లాడిండు. నిరోధ్‌లు, పాపడాలు అమ్ముకోండి అని ఆ కాంగ్రెస్ నేత మాట్లాడారు. చేనేత కార్మికులంటే అలకగా కనబడుతున్నారా..? అని కోపంలో ఒక మాట మాట్లాడాను. రూ. 370 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని విడుదల చేయాలని అడిగితే నిరోధ్‌లు అమ్ముకోండి అంటే కోపంతో ఒక మాట అన్నాను అని కేసీఆర్ తెలిపారు.

నేను బస్సు యాత్ర చేపట్టిన తర్వాత కాంగ్రెస్, బీజేపీకి గుండెలు వణుకుతున్నాయి.ఇద్దరు కుమ్మక్కై నిలువరించాలని కుట్ర చేశారు.. ప్రచారంపై బ్యాన్ పెట్టారు. నేను ఇక్కడికి 2 గంటల ముందే ఉంచాను. బ్యాన్ ఉన్నందుకు 8.15 తర్వాత బయటకు వచ్చాను. రాజకీయాల్లో మతం గురించి మాట్లాడటం ఎన్నికల నిబంధనలకు విరుద్ధం. కానీ అమిత్ షా తన చేతిలో దేవుడి బొమ్మ పెట్టుకుని మాట్లాడుతుంటే ఈసీకి



కనిపించదు. ప్రధాని మోదీ హిందూవులు ముస్లింలు అని మాట్లాడితే ఈసీకి కనిపించదు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు ఏం చేశావని అడిగితే గుడ్లు పీకి గోలీలు ఆడుతాం, పండవెట్టి తొక్కుతాం అని మాట్లాడితే ఈసీకి కనబడదు. చేనేత కార్మికుల పక్షాన మాట్లాడితే ఈ రకంగా బ్యాన్ చేశారు. ఎన్నికల్లో ఏ పార్టీ గెలవాలనేది ప్రజలే నిర్ణయిస్తారు అని కేసీఆర్ పేర్కొన్నారు.

**సింగరేణిపై చాలా పెద్ద కుట్ర జరగబోతుంది**

సింగరేణి పై చాలా పెద్ద కుట్ర జరగబోతుందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా రామగుండంలో నిర్వహించిన రోడ్ షోలో కేసీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. మంచిగ ఉన్న సింగరేణిని ఒకప్పుడు ముంచిందే కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. ఇప్పుడు మరోసారి నరేంద్ర మోదీతో కలిసి రేవంత్ రెడ్డి సింగరేణిని ముంచేందుకు కుట్రలు పన్నుతున్నారని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులు దీని గురించి ఆలోచించాలని.. కార్మికుల పక్షాన ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.

మంచిగ ఉన్న సింగరేణిని ఒకప్పుడు ముంచిందే కాంగ్రెస్ పార్టీ అని కేసీఆర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం దగ్గర అప్పులు తెచ్చి సింగరేణిని నష్టాల్లోకి పంపించి.. దాన్ని మునగొట్టిందే కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. వాస్తవానికి సింగరేణి మన తెలంగాణ ఆస్తి అని.. వంద శాతం మనకే ఉండేదని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం దగ్గర అప్పు తెచ్చి సింగరేణిని నష్టాల్లోకి పంపించి.. ఆ అప్పు తిరిగి చెల్లించలేక 49 శాతం వాటాను కేంద్ర ప్రభుత్వానికి అప్పజెప్పిందే ఈ దిక్కుమాలిన కాంగ్రెస్ పార్టీ అని మండిపడ్డారు. ఇది కాంగ్రెస్ పార్టీ చరిత్ర అని పేర్కొన్నారు. అదే బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి కార్మికులకు ఎన్నో లాభాలు తెచ్చామని తెలిపారు. డిపెండెంట్ ఉద్యోగాలను పునరుద్ధరించి.. 19 వేల మంది పిల్లలకు ఉద్యోగాలు ఇచ్చామని.. సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ( సిమ్స్ )పేరు మీద మెడికల్ కాలేజీ పెట్టుకున్నాం. ఆ మెడికల్ కాలేజీలో ఐదు శాతం కార్మికుల పిల్లలకే సీట్లు వచ్చేలా చేసుకున్నామని తెలిపారు. కానీ ఇప్పుడు సింగరేణికి పెద్ద ప్రమాదం రాబోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని నదులను కేంద్రానికి అప్పజెబుతుంటే ఈ ముఖ్యమంత్రి సప్పుడు జేయడని కేసీఆర్ విమర్శించారు. కృష్ణానదిని తీసుకెళ్లి కేఆర్ఎంబీకి అప్పజెప్పిండని అన్నారు. ఇచ్చంపల్లి దగ్గర ప్రాజెక్ట్ కట్టి గోదావరి నీటిని తమిళనాడు, కర్ణాటకకు ఇస్తానని ప్రధాని అంటుంటే.. ఈ ముఖ్యమంత్రి సప్పుడు లేదని మండిపడ్డారు. అదే తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ప్రధాని మోదీ ఇదే ప్రతిపాదన తెచ్చిండని తెలిపారు. అయితే.. కేసీఆర్ బతికి ఉండగా గోదావరి నీళ్లు తీసుకెళ్తే ఒప్పుకోనని చెప్పానని పేర్కొన్నారు. కానీ ఇవాళ ఈ ముఖ్యమంత్రి మౌనం వెనుక ఉన్న మతలబు ఏంటనేది ఆలోచన చేయాలని పిలుపునిచ్చారు. గోదావరి నది మన బతుకు.. దాన్నే తీసుకెళ్తా అంటే కాంగ్రెస్ గానీ, ముఖ్యమంత్రి గానీ ఎవరూ కూడా నోరు తెరిచి మాట్లాడే పరిస్థితి లేదని మండిపడ్డారు.

‘ ఇక్కడ ఉన్న ముఖ్యమంత్రి.. ప్రధానిని బడే భాయ్ అని అంటాడు. గుజరాత్ మోడల్ తెస్తా అంటడు. కానీ ఆ గుజరాత్‌లో పేదల సంక్షేమం చూడరు.. అక్కడ పెట్టుబడిదారుల రాజ్యమే తప్ప కార్మికులు, ప్రజలకు మాట్లాడే హక్కులు కూడా లేవు. ‘ అని కేసీఆర్ అన్నారు. ఇక మోదీ చోటే భాయ్.. అదే భారత దేశాన్ని మింగుతున్న అదానీ.. మోదీ అండదండలతో 14 లక్షల కోట్లకు పడగలెత్తిన ఆదానీ.. దేశంలోని అన్ని పబ్లిక్ సెక్టార్ రంగాలను కబలిస్తున్నాడు. టీవీ రంగం కావచ్చు.. కేబుల్స్ కావచ్చు.. ప్రతి రంగాన్ని కబలిస్తున్నాడు. దేశంలో ఉన్న ఓడ రేవులన్నీ కూడా ఆదానీకి అన్యక్రాంతమైపోయాయి. ఎయిర్‌పోర్టులను కూడా ఆదానీకే మోదీ అంకితం చేశాడు.’ అని కేసీఆర్ తెలిపారు.

నేను సీఎంగా ఉన్న రోజుల్లో కరెంటు ఉత్పత్తి కోసం ఆస్ట్రేలియా నుంచి బొగ్గు దిగుమతి చేసుకోవాలని మోదీ చెప్పాడు. ఆస్ట్రేలియా నుంచి బొగ్గు తెచ్చేది ఎవరు ఆదానీ.. నరేంద్ర మోదీ తమ్ముడు. మన దగ్గర 4 వేలకు టన్ను దొరికే బొగ్గును.. అక్కడ 28 వేలకు టన్ను కొనమన్నాడు. కానీ నేను ఒప్పుకోలేదు. నా ప్రాణం పోయినా సరే ఒప్పుకోనని చెప్పా. నాకు సింగరేణి బొగ్గు ఉండగా.. నీ బొగ్గు ఎందుకు అని చెప్పిన. కానీ ఇవాళ ఇదే ముఖ్యమంత్రి పోయి స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ఆదానీకి గేట్లు తెరిచి వచ్చిండు.. ఆదానీ మీరు తెలంగాణకు రండి.. నాలుగు చేతులతో దోచుకోండి అని సంతకాలు కూడా పెట్టి పిలిచివచ్చిండు. పార్లమెంటు ఎన్నికలు అవ్వడమే ఆలస్యం.. ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి కలిసి సింగరేణిని ఊడగొడతరు. ఇది నిజమా కాదా అని ఇంటికి వెళ్లినంక చర్చ జేయండి. ముఖ్యమంత్రి ఆదానీని ఎందుకు పిలిచిండు.. నేనెందుకు రానివ్వలేదు అనేది ఆలోచన చేయాలని కేసీఆర్ సూచించారు.

తెలంగాణకు సింగరేణి కొంగుబంగారం. ఒక ఉద్యోగ వనరు. లక్షలాది మంది కార్మికులు, వారిని అనుసరించుకుని అనేక ప్రజలు బతికే ప్రాంతం సింగరేణి. దీన్ని ఇంకా విస్తరించాలి. బయ్యారం ఉక్కుగనులు గానీ, గోదావరి ఇసుక గనులు గానీ సింగరేణికే ఇవ్వాలని నేను సీఎంగా ఉన్నప్పుడు ఆలోచించినా. సింగరేణి డైరెక్టర్‌ను ఆస్ట్రేలియాకు, ఇండోనేసియాకు పంపించిన. ఆదానీ వెళ్లి కోట్లు గడిస్తుండు.. మనం వెళ్లి అక్కడ ఎందుకు పట్టుకోవద్దు.. సింగరేణి కంపెనీని ఆస్ట్రేలియా, ఇండోనేసియాలో పెట్టమని చెప్పిన. కానీ ఇవాళ ఆదానీ బొగ్గును తీసుకుందామని ఈ ముఖ్యమంత్రి ప్రయత్నం చేస్తున్నాడు. ఇది తేడా. రాబోయే రోజుల్లో ఉన్న సింగరేణిని ఊడగొట్టి ఆదానీకి అప్పగిస్తే మన కార్మికుల నోట్లో మట్టి.. మన ప్రజల నోట్లో మట్టి. మొత్తం సింగరేణి ప్రాంతాల్లోని ప్రజల బతుకులు బొగ్గు అయ్యే పరిస్థితి ఉంటుంది. సింగరేణి కార్మికులు ఈ మాటను చైతన్యంతో ఆలోచించాలి. మీ నిర్ణయం అట్ల తీసుకోవాలి. ఇది చాలా ప్రమాదం. ఇవాళ మీరు పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌ను గెలిపిస్తే నేను కూడా ఏం చేయలేను. నావల్ల కూడా ఏం కాదు. కొప్పుల ఈశ్వర్ గెలిస్తే.. మొత్తం బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంటులో ఎగిరి గంతేసి కొట్లాడి.. పీకపట్టుకుని మా సింగరేణిని ఎట్ల ముంచుతవని కొట్లాడతరు.’ అని కేసీఆర్ తెలిపారు. సింగరేణిని కాపాడుకోవాలంటే.. బొగ్గు గని కార్మికుల పక్షాన ఉన్న కొప్పుల ఈశ్వర్ గెలవాలని అన్నారు.

## బీఆర్ఎస్ చచ్చిన పాము... బీజేపీ అబద్ధాల పుట్ట

-మొదటి పేజీ తరువాయి

చెబుతున్న 5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థకు పీవీ సంస్కరణలే పునాదులు అన్నారు. బీజేపీ నేతలు నోరు తెరిస్తే అబద్దాలు చెబుతున్నారని... తెలంగాణకు ఏం తెచ్చారో... ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణపై కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని ఆరోపించారు. సింగరేణిలో 50వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారని... ఇది నల్ల బొగ్గు కాదు... నల్లబంగారమన్నారు. నేతకాని కార్పోరేషన్, సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మంచిర్యాల కరకట్ట, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మంజురుకు కృషి చేస్తానన్నారు. పెద్దపల్లికి చాలా పెద్ద చరిత్ర ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో పెద్దపల్లి అభివృద్ధి చెందలేదన్నారు. వాట్సాప్ యూనివర్సిటీ ద్వారా బీజేపీ అబద్దపు ప్రచారం చేస్తోందని విమర్శించారు. విభజన హామీలు ఒక్కటీ అమలు చేయలేదని మండిపడ్డారు. సింగరేణి మూతబడే పరిస్థితి ఉంటే కేంద్రంతో మాట్లాడి రూ.1000 కోట్లు మంజూరు చేయించిన ఘనత కేకేది అన్నారు. పదవులకు వన్నె తెచ్చిన వ్యక్తి శ్రీపాదరావు అని కొనియాడారు. కాంగ్రెస్ రిజర్వేషన్లు పెంచాలని చూస్తే బీజేపీ రద్దు చేయాలని చూస్తోందన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితే రిజర్వేషన్లు ఎక్కడకూ పోవన్నారు. బీజేపీకి 400 సీట్లు వస్తే మాత్రం రాజ్యాంగాన్ని మారుస్తుందని హెచ్చరించారు.

**పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి రిటర్న్ గిఫ్ట్ ఇద్దామా? వద్దా?**

కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా తీవ్ర విమర్శలు గుప్పించారు. పదేళ్లుగా తెలంగాణ ప్రజలు తమ రక్తాన్ని చెమటగా మార్చి ఢిల్లీ దర్బారుకు పన్నులు, జీఎస్టీ కట్టి కట్టి అలిసిపోయారన్నారు. మరి ఢిల్లీ దర్బారు తిరిగి తెలంగాణకు ఏమి ఇచ్చిందని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఇచ్చింది కేవలం ‘గాడిద గుడ్డు’ మాత్రమేనని విమర్శించారు. మనకు గాడిద గుడ్డును ఇచ్చిన బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో రిటర్న్ గిఫ్ట్ ఇద్దామా? వద్దా? అని ప్రశ్నించారు.

## ఖమ్మంలో బీఆర్ఎస్ పార్టీకి షాక్... కాంగ్రెస్‌లో చేరిన మేయర్

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మేయర్ నీరజ**

**మేయర్‌తో పాటు కాంగ్రెస్‌లో చేరిన మరో ఇద్దరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు**

**మొదటి నుంచి తుమ్మల నాగేశ్వరరావు అనుచరులుగా ఉన్న నీరజ దంపతులు**



బీఆర్ఎస్ పార్టీకి ఖమ్మంలో భారీ షాక్ తగిలింది. ఖమ్మం నగర మేయర్ నీరజ అధికార పార్టీలో చేరారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో ఆమె కాంగ్రెస్‌లో చేరారు. తుమ్మల ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మేయర్‌తో పాటు మరో ఇద్దరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మేయర్ నీరజ, ఆమె భర్త బ్రహ్మాంలు మొదటి నుంచి తుమ్మల నాగేశ్వరరావు అనుచరులు. దీంతో వారు కాంగ్రెస్‌లో చేరతారని మొదటి నుంచి ప్రచారం సాగుతోంది. కాంగ్రెస్‌లో చేరిన ఇద్దరు కార్పొరేటర్లలో 11వ డివిజన్ కార్పొరేటర్ సరిపుడి రమాదేవి, 13వ డివిజన్ కార్పొరేటర్ నీరజ ఉన్నారు.

## బండి సంజయ్ ఫేక్ వీడియో, ఫేక్ కాల్ రికార్డింగ్ సృష్టి... కాంగ్రెస్ అభ్యర్థిపై కేసు నమోదు

**సంజయ్ డీప్ ఫేక్ వీడియోలు, కాల్ రికార్డులు సృష్టించి సోషల్ మీడియా ఖాతాలో దుష్ప్రచారం చేశారని కేసు**

**రిటర్నింగ్ అధికారి, పోలీసులకు ఫిర్యాదు చేసిన బీజేపీ నేతలు**

**వెలిచాల రాజేందర్‌పై కేసు నమోదు చేసిన కరీంనగర్ పోలీసులు**



బీజేపీ ఎంపీ, కరీంనగర్ లోక్ సభ అభ్యర్థి బండి సంజయ్ ఫేక్ వీడియోను సృష్టించారనే ఆరోపణలపై కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావుపై ఎఫ్ఐఆర్ నమోదయింది. సంజయ్ అనని మాటలను అన్నట్లుగా డీప్ ఫేక్ వీడియోలు, కాల్ రికార్డులు సృష్టించి తన సోషల్ మీడియాఖాతాలో దుష్ప్రచారం చేశారంటూ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి, పోలీసులకు బీజేపీ నేత మురళీకృష్ణ ఫిర్యాదు చేశారు. బీజేపీ నేతల ఫిర్యాదుపై స్పందించిన కరీంనగర్ టూటౌన్ పోలీసులు కాంగ్రెస్ అభ్యర్థిపై కేసు నమోదు చేశారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా అమిత్ షా ఫేక్ వీడియో కలకలం రేపుతోంది. దీనికి సంబంధించి దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయి. తెలంగాణలోను ఆరుగురు కాంగ్రెస్ సోషల్ మీడియా ఇంఛార్జులను అరెస్ట్ చేశారు. వారికి ఈరోజు నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

## ఐదు నెలల్లోనే రేవంత్ రెడ్డి అవినీతి మార్క్ పాలన



ఐదు నెలల్లోనే రేవంత్ రెడ్డి అవినీతి మార్క్ పాలనను చూపిస్తున్నారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణలో మార్పు వచ్చిందని చెబుతున్న ముఖ్యమంత్రి... ఏం మార్పు వచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణలో కేవలం కల్వకుంట్ల కుటుంబ పాలన పోయి సోనియా గాంధీ కుటుంబ పాలన వచ్చిందని విమర్శించారు. ఇదేనా వచ్చిన మార్పు? అని నిలదీశారు. రేవంత్ రెడ్డి హామీలు ఇచ్చి ఇప్పుడు గాడిద గుడ్డు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హోర్డింగ్స్ కూడా పెట్టారని... కానీ ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. ఆరింట ఐదు గ్యారెంటీలు అమలు చేశామని చెబుతున్నారని... కానీ ఎక్కడ చేశారని ప్రశ్నించారు. జర్నలిస్టులకు, హోంగార్డులకు ఇచ్చిన హామీలను నెరవేర్చారా? అని ప్రశ్నించారు. రైల్వేలపై మాట్లాడే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు.

# సంపాదకీయం

## ముంచుకొస్తున్న నీటి ముప్పు

ప్రపంచం ముందున్న అత్యంత తీవ్రమైన సమస్యల్లో జల సంక్షోభం ఒకటి. ఇటు మనదేశంలోనూ నానాటికీ జల వనరుల కొరత పెరుగుతూ పోతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మంచినీటి వనరుల్లో మన దేశం వాటా 4 శాతం మాత్రమే. మనదేశంలో ప్రతి ముగ్గురిలో ఒక మనిషి స్వచ్ఛమైన నీటిని పొందలేకపోతున్నాడని, 2050 నాటికి దేశంలో నీటి కొరత మరింత పెరగటమే గాక దేశంలో సగం జిల్లాలు తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కోబోతున్నాయని నిపుణులు చెబుతున్నారు. 'పంటల సాగును మార్చడం, భారతీయ వ్యవసాయ రంగంలో నీటి వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచడం' అనే అంశంపై డీసీఎం శ్రీరాం ఫౌండేషన్ చేపట్టిన అధ్యయనంలో దేశంలోని జలవనరుల గురించిన అనేక ఆసక్తికర, ఆందోళనకరమైన అంశాలు బయటికొచ్చాయి.భారతదేశపు భూగర్భ జలాల్లో నానాటికీ పెరిగిపోతున్న ఆర్సెనిక్, ఫ్లోరైడ్ సమస్యపై కేంద్ర భూగర్భజల అథారిటీ ప్రతిస్పందనపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఇటీవల అసంతృప్తి వ్యక్తం చేసింది. భారతదేశంలోని 25 రాష్ట్రాల్లోని 230 జిల్లాల్లో ఆర్సెనిక్, 27 రాష్ట్రాల్లోని 469 జిల్లాల్లో ఫ్లోరైడ్ భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. మనదేశంలో 60 శాతం వ్యవసాయం భూగర్భజలాల ఆధారంగానే జరుగుతోంది. నీతి అయోగ్ 2018 నివేదిక ప్రకారం దేశంలో 60 కోట్ల మంది తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటుండగా, 43 శాతం జనాభాకు నేటికీ రక్షిత సదుపాయం లేదు. ఈ సమస్య కారణంగా ఏటా 2 లక్షలమంది ప్రజలు మృత్యువాత పడుతున్నారు. మనదేశంలోని జల వనరుల్లో 70% కలుషితమైపోవటం, నేటికీ ఇంటి ఆవరణలో తాగునీటి వసతి లేక మరోచోట నుంచి నీళ్లు తెచ్చుకునేవారి జనాభా గణనీయంగా ఉందని ఆ నివేదిక వెల్లడించింది.దేశంలోని అనేక గ్రామాల్లో మంచినీటి కోసం నేటికీ ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయని, నీటి కొరత మూలంగా దేశం మహిళలు ఏటా సుమారు 15 కోట్ల పని దినాలను కోల్పోతున్నారనీ, ప్రపంచ ఆరోగ్య సంస్థ ? యూనిసెఫ్ సంయుక్త నివేదిక పేర్కొంది. పారిశుద్ధ్యం, తాగునీటి పురోగతిపై ఈ రెండు సంస్థలు చేసిన అధ్యయనంలో మోతాదుకు మించిన భూగర్భజలాల వినియోగం, భూసారాన్ని దెబ్బతీయటం, అధిక కాలుష్యానికి కారణమై.. అనేక పర్యావరణ , సామాజిక, ఆర్థిక సమస్యలకు దారితీయనుందని వెల్లడైంది. భూగర్భజల వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవటానికి సరైన పర్యవేక్షణ, నియంత్రణ గల వ్యవస్థలు, ప్రణాళికలు అవసరమని ఈ అధ్యయనం వెల్లడించింది. పారిశ్రామిక వ్యర్థ జలాలు, ఇతర మానవ తప్పిదాల కారణంగా హానికారక ఆర్సెనిక్, కాడ్మియం వంటి లోహాలు భూగర్భ జలాల్లో కలిసిపోయి, మానవ, ఇతర ప్రాణుల ఉనికినే ప్రమాదంలోకి నెడుతున్నాయని దీనివల్ల రాబోయే రోజుల్లో భారత్‌లో అనేక ప్రతికూల పరిణామాలు ఏర్పడతాయని ఈ అధ్యయనం ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికే మనదేశంలోని గంగా పరీవాహక ప్రాంతంతో బాటు వాయవ్య రాష్ట్రాల్లో భూగర్భ జలాలు కనీస స్థాయికి పడిపోయాయి. దీనివల్ల ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో పర్యావరణ ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా కొన్ని రకాల జంతుజాలపు ఉనికి శాశ్వతంగా కనుమరుగు అవుతోంది.ప్రపంచవ్యాప్తంగా భూగర్భ జలాలు ఏటికేడు క్షీణించటంతో ఆహార భద్రత పెను ప్రమాదంలో పడబోతోంది. నదులు, జలాశయాల్లోకి చేరుతున్న నీటి కంటే, ప్రజలు వాడుతున్న నీరు ఎక్కువ కావటం, అదీ సరిపోక భూగర్భ జలాలను తోడేయటంతో విశ్వవ్యాప్తంగా 21 ప్రధాన జలాశయాల్లో నీటిమట్టాలు పూర్తిగా క్షీణించాయి. సౌదీ అరేబియా మొదలు పలు దేశాలు ఇప్పటికే భయంకరమైన జలసంక్షోభంలో కూరుకొని పోయాయి. 90వ దశకంలో సాగుకోసం సౌదీ అరేబియా పెద్దయెత్తున భూగర్భజలాలను తోడి, ప్రపంచంలో ఆరవ అతిపెద్ద గోధుమ ఎగుమతిదారుగా మారింది. ఇప్పుడు భూగర్భ జలాలు పడిపోవటంతో ఆ దేశం గోధుమలను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. భూగర్భ జలాల వినియోగంలో మనదేశం చైనా, అమెరికా కంటే ముందుంది. పంజాబ్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో నేటికీ బోరుబావుల ఆధారంగా వరి, గోధుమ సాగుచేస్తున్నారు. పంజాబ్‌లో ఏకంగా 78 శాతం రైతులు బావినీటిని వాడుతున్నారు. దేశంలో అత్యధికంగా గోధుమను పండించే రాష్ట్రాల్లో ఈ మూడు రాష్ట్రాలు ముందువరుసలో ఉన్నాయి.ఏటికేడు తగ్గిపోతున్న భూగర్భ జలాలు, మానవ తప్పిదాల కారణంగా భూగర్భ జలాల్లోకి చేరుతున్న ఫ్లోరైడ్, ఆర్సెనిక్ వంటి హానికారకాలు, తీర ప్రాంతాల్లో భూగర్భ జల మట్టాలు తగ్గడం వల్ల, సముద్రపు ఉప్పు నీరు చొచ్చుకొని వచ్చి పంటనేలలు ఉప్పునేలలుగా మారిపోవటం, మంచినీటి కటకట ఏర్పడుతోంది. భారత్‌లో భూగర్భ జల మట్టాలు ఏటా సగటున ఒకటి నుంచి రెండు మీటర్ల చొప్పున క్షీణిస్తున్నట్లు అంచనా. అవి 8 మీటర్ల దిగువకు పడిపోయిన జిల్లాల్లో పేదరికం రేటు మిగతా జిల్లాల కంటే తొమ్మిది నుంచి 10శాతం అధికంగా ఉందని నివేదికలు వెల్లడిస్తు?న్నాయి. భూగర్భ జలాల లభ్యత క్షీణిస్తే భారత్‌లో 25 శాతానికి పైగా సాగుభూమి తక్షణం ప్రభావితమై కరువు తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.చిత్తడి నేలలు, నదీ ముఖద్వారాల ఆక్రమణ, పెరుగుతున్న పట్టణీకరణ, చెరువులు, ఇతర నీటి వనరుల విధ్వంసం, అతి వినియోగం భూగర్భ జలాల క్షీణతకు ప్రధాన కారణాలు. ప్రస్తుతం చాలా చోట్ల నీరు అధికంగా అవసరమయ్యే వరి, గోధుమ, చెరకు పంటలనే రైతులు ఎక్కువగా పండిస్తున్నారు. పలు రాష్ట్రాల్లో వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు పథకాన్ని ఆసరాగా చేసుకొని కొందరు రైతులు అవసరానికి మించి భూగర్భ జలాలను తోడేస్తున్నారు. దీనివల్ల భవిష్యత్తులో తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కోవాల్సి వస్తుందని గుర్తించాలి. అందుబాటులో ఉన్న నీటిని అవసరం మేరకు పొదుపుగా వాడుకోవాలి. ఖరీఫ్,రబీ సీజన్‌లో ఒకే పంట పండిచే పద్ధతిని మానుకోవటం, తక్కువ నీటితోనే పండే పోషక విలువలున్న చిరుధాన్యాల సాగుకు రైతాంగాన్ని సిద్ధం చేయాలి. పలు పరిశ్రమలు ప్రమాదకర వ్యర్థాలను గుట్టుచప్పుడు కాకుండా నదులు, చెరువుల్లోకి వదిలిపెడుతున్నాయి. వాన నీటిని ఒడిసిపట్టి ఆయా అవసరాలకు వినియోగించుకోవాలి. తద్వారా భవిష్యత్తులో జల సంక్షోభం తలెత్తకుండా నివారించవచ్చు. నిబంధనల మేరకు వ్యర్థాలను శుద్ధి చేయని కర్మాగారాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం పౌర సమాజం, ప్రభుత్వాలు, అధికార యంత్రంగాలు, స్వచ్ఛంద సంస్థలు సామాన్యులు అందరూ సమన్వయంతో కదలాలి. నీటి సంరక్షణ విషయంలో బాధ్యత యుతంగా వ్యవహరించడం తక్షణ అవసరం. నీటిని పొదుపుగా వాడుకుంటూ వృథాను అరికడుతూ వ్యర్థ జలాల్ని పునర్వినియోగిస్తూ ప్రతి వర్షం చుక్కలు పౌరక్షించుకుంటూ జల వనరులను పునర్జీవనం కల్పిస్తూ ముందడుగు వేస్తేనే మెరుగైన భవిత సాధ్యమవుతుంది.

# సంగీత సామ్రాజ్య రారాజు త్యాగరాజు



అసంఖ్యాక కీర్తనలకు ప్రాణం పోసి, కర్ణాటక సంగీతంలోని నియమాలను సోదాహరణంగా నిరూపించి, కర్ణాటక సంగీతానికి మూల స్తంభమై, త్రైమూర్త్య వాగ్గేయకారులలో ఒకరై, నాదోపాసన ద్వారా, భగవంతుని తెలుసుకో వచ్చునని నిరూపించి, ఆరాధనీయులు అయినారు... త్యాగయ్య, త్యాగబ్రహ్మగా వినుతికెక్కిన వాగ్గేయ కారుడు కాకర్ల త్యాగరాజు, త్యాగయ్య కీర్తనలు, శ్రీరామునిపై ఆయనకుగల విశేష భక్తిని, వేదాలపై, ఉ పనిషత్తులపై ఆయనకున్న జ్ఞానాన్ని తెలియ పరుస్తాయి. ఉపనయనం తరువాత తండ్రిగారి బోధలు, 18వ ఏట రామకృష్ణానంద పరబ్రహ్మం ఉపదేశం చేసిన రామ షడక్షరీ మంత్ర ప్రభావం, తల్లి అలవర్చిన భక్తి సంగీతాలు బాల్యంలోనే బీజాంకురాలై త్యాగ రాజస్వామి వారిలో మూర్తీభవించాయి. నేటి ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశం జిల్లా కంభం మండలం కాకర్ల గ్రామంలో, 1767 లో మే 4న, తెలుగు వైదిక కుటుంబీకులైన కాకర్ల రామబ్రహ్మం, సీతమ్మ పుణ్య దంపతులకు త్యాగరాజు మూడవ సంతానంగా జన్మించారు. ఆయన జన్మనామం కాకర్ల త్యాగ బ్రహ్మం. ములకనాడు తెలుగు బ్రాహ్మణులు, త్రిలింగ వైదీకులు, అయన పూర్వీకులు ప్రస్తుత ప్రకాశం జిల్లా కంభం మండలంలో కాకర్ల అను గ్రామం నుండి తమిళ దేశానికి వలస వెళ్లారు. తండ్రి తంజావూరు ప్రభువు శరభోజి వద్ద ఉండే వారు. తాత గిరిరాజ కవి. త్యాగ బ్రహ్మం విద్యకోసం, తిరువారూర్ నుండి తిరువయ్యూరు వెళ్లారు. అక్కడ సంస్కృతం, వేద వేదాంగములు ఆమూలాగ్రంగా పఠించి, శొంఠి వెంకట రమణయ్య వద్ద, భక్తిశ్రద్ధలతో సంగీతంలో ప్రావీణ్యం సంపాదించు కున్నారు.

తండ్రి పిన్న వయసు నందే స్వర్గ ప్రాప్తి నొందగా, అన్నదమ్ముల మధ్య భాగ పరిష్కారంలో, తమ వంతు వచ్చిన, శ్రీరామ లక్ష్మణ కుల విగ్రహాలను పూజిస్తూ, "ఉ ఛ" వృత్తి స్వీకరించి, ఇష్ట దైవమైన శ్రీ రాముని పై కృతుల రచనలో అధికభాగం గడిపారు. త్యాగయ్య 96 కోట్ల శ్రీరామ నామ జపం ఆచరించి భగవద్దర్శనం, ఆశీర్వచనం పొందారని చెబుతారు. 18 ఏళ్ల వయసులో, పార్వతి అనే యువతిని వివాహ మాడారు. పార్వతి చిరు ప్రాయ మరణంతో, ఆమె సోదరి కమలను పరిణయ మాడారు. సీతా లక్ష్మి అనే కూతురు కలిగింది, ఆమె ద్వారా మనమడు కూడా కలిగాడు. కానీ, మనమడు చిన్నతనం లోనే మృతి చెందడంతో, ఆయనకు వారసులు లేకుండా పోయారు. శొంఠి వెంకట రమణయ్య శిష్యరికంలో 13వ ఏటనే "నమో నమో రాఘవా" అనే కీర్తనను "దేశిక తోడి రాగం"లో స్వరపరిచారు. త్యాగరాజు మంచి వైణికులు కూడా. గురువుగారి గృహములో చేసిన కచేరీలో, త్యాగరాజ పంచరత్న కృతులలో ఐదవది అయిన, "ఎందరో మహానుభావులు" కీర్తన స్వరపరచి గానం చేశారు. త్యాగయ్య గొప్పతనాన్ని గుర్తించిన గురువు, తంజావూరు రాజుకు చెప్పగా, ఆ రాజు ధన, కనక, వస్తు, వాహనాలతో సభకు ఆహ్వానించాడు. కానీ తనకు "నిధి కన్నా రాముని సన్నిధి సేవే సుఖమ"ని భావించి, త్యాగయ్య అన్నింటిని తిరస్కరించారు. సంగీతంలో తన ప్రావీణ్యాన్ని ప్రదర్శించడం కన్నా, భగవదారాధనకు ఒక సాధనంగానే చూశారాయన. తంజావూరు రాజు కానుకల తిరస్కార ఫలితంగా, సోదరుడు జపేశుడు, త్యాగయ్యచే నిత్య పూజలందుకునే, శ్రీరామ పట్టాభిషేకం విగ్రహాలను, కావేరీ నదిలో విసిరి వేయగా, శ్రీరామ వియోగాన్ని భరించలేక... దక్షిణ దేశ యాత్రలు చేసి, ఎన్నో ఆలయాలు, తీర్థ క్షేత్రాలను దర్శించారు. ఈ క్రమంలో అత్యద్భుత కీర్తనలను రచించారు. "రామేతి మధురం వాచం" అన్నట్లు 96 కోట్ల సార్లు రామ నామాన్ని జపించి, స్వీయానుభవ భావనలే కృతి రూపంలో మలచి గాంధర్వగాన మధురానుభూతిగా లోకానికి అందించారు. భూలోక నారదుడైన త్యాగరాజ స్వామికి, దేవ ఋషి అయిన "నారదుడే స్వయంగా సంగీతంలోని రహస్యాలను చెప్పి, "స్వరార్ణవము" ఇచ్చినట్లు, సందర్భంలోనే "సాధించెనే మనసా" అనే పంచ రత్న మాలిక లోని మూడవ కృతి చేసినట్లు ప్రాచుర్యంలో ఉన్నది. నారద అనుగ్రహ ఫలితంగానే అనేక విషయాలు గ్రహించి, 24వేల రచనలు, 800కీర్తనలు గావించాడు. మంత్రోపదేశంతో "స్వర్ణార్ణవం, నారదీయం" అనే రెండు సంగీత రహ స్మార్థ శాస్త్ర గ్రంథ రచనలు గావించారు. త్యాగయ్య కృతులను ప్రాపంచికం, తాత్వికం, కీర్తనం, నిత్యానుష్టానం, అని నాలుగు విధాలుగా గుర్తించారు. చాలావరకు తెలుగులో రచనలు చేసినా, అవి తెలుగు నాట కన్నా, తమిళ నాట ఎక్కువ ప్రాచుర్యం పొందాయి. జగదానంద కారకా అనే కీర్తన శ్రీరాముని 109 నామాలను ఉటంకిస్తుంది. "జగదానంద కారకా (నాట), దుడుకు గల (గౌళ), సాధించినే (అరభి), ఎందరో మహానుభావులు (శ్రీ), కన కన రుచిరా (వరాళీ.. అనేవి పంచ రత్న మాలికగా, "త్యాగరాజ ఆరాధనోత్సవాలలో ప్రారంభం కీర్తనలుగా గానం చేయ బడతాయి. త్యాగరాజ స్వామి పరమపదించిన దినమైన, పుష్య కృష్ణ పక్ష పంచమి నాడు, శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రధానంగా తమిళనాడు లోని తంజావూరు జిల్లా తిరువయ్యూరు లోని, త్యాగయ్య సమాధి ప్రాంగణాన, ఉత్సవాలు ఏటా జరుగుతాయి. త్యాగయ్య 1847 జనవరి 6న తన 79వ ఏట మరణించగా, ఆయన మరణానికి ముందు సన్యాసిగా మారగా, ఆయన భౌతిక కాయాన్ని కావేరీ తీరాన ఖననం చేసి, అక్కడ స్మారక చిహ్నాల నిర్మాణం గావించారు. ఆయన శిష్యగణం అక్కడే సంస్కరణ కార్యక్రమాలు జరుపగా, 1903 తర్వాత పట్టించుకునే స్థితిలో, ప్రముఖ సంగీత విద్వాంసులైన, ఉ మయాల్పురం కృష్ణ భాగవతార్, సుందర భాగవతార్లు తమ గురువు సమాధి దయనీయ స్థితికి చలించి, పునరుద్ధరణ గావించారు. 1905లో త్యాగయ్య వర్ధంతి దినాన తిరువయ్యూరులో, అన్నదానం, సంప్రదాయ పూజలు ఘనంగా నిర్వహించారు. నాటినుండి దేశంలో పలుచోట్ల ఆరాధనోత్సవాలు నిర్వహిస్తుం డడం అనవాయితీగా వస్తున్నది. అలాగే త్యాగయ్య జన్మదినం రోజుని భారతీయ సంగీత దినోత్సవంగా జరుపు కుంటారు.

# బ్రిటిషర్లకు సింహ స్వప్నమైన టిప్పు



భారత దేశ స్వాతంత్ర్య చరిత్ర ఎందరో అమరుల త్యాగాలతో నిండి ఉంది. దేశ రక్షణకోసం అసంఖ్యాకమంది వీరులు తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యాగంచేశారు. అందులో టిపూ సుల్తాన్ అమరత్వం అపూర్వం, అనుపమానం. 1750 నవంబర్ పదవ తేదీన కర్నాటక రాష్ట్రంలోని కోలార్ జిల్లా, దేవనహళ్లి లో ఫాతిమా ఫఖ్రున్నీసా, హైదర్ అలీలకు టిపూ జన్మించాడు. టిపూను అన్నిరంగాల్లో నిష్ణాతుణ్ణి చేయాలని కలలుగన్నతండ్రి హైదరలీ చిన్నతనం నుంచే మంచి విద్యాబుద్ధులు చెప్పించాడు. తన స్వీయ పర్యవేక్షణలో యుద్ధ కళల్లోని మెళకువలు నేర్పించాడు. తండ్రి కనుసన్నలలో యుద్ధ కళలో అసాధారణ ప్రావీణ్యతను సాధించిన టిపూ, నాటి ప్రముఖ యోధులందరిలో అగ్రగామిగా గుర్తింపు పొంది, పిన్న వయసులోనే ప్రతిభను చాటాడు. ఆంగ్ల మూకల కబంధ హస్తాల నుండి దేశాన్ని రక్షించడానికి ఆయన సాగించిన పోరాటం అజరామరం. పిన్న వయసులోనే టిపూ చూపిన తెగువ, ప్రదర్శించిన ధైర్య సాహసాలు ఊహకందనివి. మంచీ చెడుల విశ్లేషణ టిపూకు చిన్నతనం నుండే అలవడింది. సునిశిత పరిశీలనద్వారా సాధించిన అపూర్వ మేధా పరిజ్ఞానం సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ పరిణామాలపట్ల ఆయనకున్న సాధికారత ఫ్రెంచ్ , ఆంగ్లేయాధికారుల్ని సైతం ఆశ్చర్య చకితుల్ని చేసింది. జాతీయ , అంతర్జాతీయ విషయాలపై టిపూ వ్యక్త పరిచిన అభిప్రాయాలను, దౌత్య వ్యూహాలను ఆయన శత్రువు డోవ్ టన్ లాంటి బ్రిటిష్ అధికారి సైతం ప్రశంసించకుండా ఉండలేక పొయ్యాడు. పదిహేనేళ్ళ పిన్నప్రాయంలోనే టిపూ రాజ్యపాలనా వ్యవహారాల్లో తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటూ యుద్ధాల్లో పాల్గొన్నాడు. మొదట బ్రిటిషర్ల కూటమి నుండి నిజాంను దూరంచేయడానికి సాగిన ప్రయత్నాల్లో భాగంగా ఎంతో పరిణితితో, నేర్పుతో, దౌత్య కార్యాన్ని నడిపినప్పుడు ఆయన వయసు కేవలం పదిహేడేళ్ళు. టిపూ ప్రదర్శించిన రాజనీతికి ముగ్ధుడైన నిజాం టిపూను ఫతే అలీఖాన్ అన్న బిరుదుతో సత్కరించాడు. టిపూ తండ్రి హైదర్ 1782 లో శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ నవంబర్ 6 న రణరంగంలోనే తుది శ్వాస వదిలాడు. తండ్రికన్ను మూసిన వార్త తెలియగానే టిపూ హుటాహుటిన శ్రీరంగపట్నం చేరుకున్నాడు. అప్పటికి ఆయన వయసు 31 సంవత్సరాలు. చిన్న వయసులోనే వీరాధి వీరుడిగా , ప్రజాసంక్షేమమే ఊపిరిగా ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసిన టిపూ సుల్తాన్ మైసూరుకు రాజయ్యాడు. ప్రజా సంక్షేమంలోనే రాజ్యసంక్షేమం, రాజుసంక్షేమం దాగుందందని బలంగా నమ్మే టిపూ రాజ్యాభిషేకం రో జునే, 'ప్రజల్ని విస్మరించి, ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా పనిచేస్తే నేను నాజీవితాన్ని, నాసంతానాన్ని, చివరికి నాస్వర్గాన్నికూడా కోల్పోవచ్చు. ప్రజలసంక్షేమం, వారి సంతోషంలోనే నా సంతోషం. సంక్షేమం ఇమిడిఉంది. నాకిష్టమైనదాన్ని కాకుండా. నాప్రజలకు ప్రయోజనకరమైనదాన్నే నేను నాఇష్టంగా, అదృష్టంగా భావిస్తాను. ఎందుకంటే రాజ్యాధికారం ప్రజలకు సేవ చేయడానికేగాని, స్వీయలాభం పొందడానికి కాదు.' అని విస్పష్టంగా ప్రకటించాడు. ప్రజల జీవితాలను సుఖమయం చేయడానికి టిపూ వినూత్న విధానాలను అవలంబించాడు. స్వదేశీ విజ్ఞానాన్ని విదేశీ పరిజ్ఞానంతో మేళవించి ప్రజోపయోగానికి వినియోగించిన ప్రప్రథమ స్వదేశీ పాలకుడిగా ఖ్యాతి గడించాడు. పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహన్నందించాడు. వివిధరకాల చేతివృత్తులను అభివృద్ధి పరిచాడు. సహకార వ్యవస్థను పటిష్ట పరిచాడు. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించి, ఎగుమతులను చేపట్టాడు. వర్తక , వాణిజ్య రంగాల్లో ప్రభుత్వపాత్రను విస్తరించేందుకు టిపూ ఆనాడే ప్రభుత్వ వ్యాపార సంస్థను ఏర్పాటు చేశాడు. టిపూ సుల్తాన్ వ్యవసాయ రంగాన్ని ఇతోధికంగా ప్రోత్సహించాడు. నీటిపారుదల రంగంపై ప్రత్యేకశ్రద్ధ కనబరిచాడు. పంట సిరులు అందించే రైతన్నకు టిపు సుల్తాన్ భూమిపై హక్కును కల్పించాడు. జాగీర్దారీ వ్యవస్థకు చరమగీతం పాడాడు.

బీడుభూములను మాగా ణులుగా మార్చే రైతన్నలు మూడేళ్ళ వరకూ ఎలాంటి పన్నూ కట్టనవసరం లేదని ప్రకటించాడు. వ్యవసాయ రంగానికి సంబంధించిన అన్ని అవసరాలకు ప్రభుత్వం తరఫున రుణ సౌకర్యం కల్పించాడు. టిపూ జనరంజక పాలనలో ప్రజలు సుఖ శాంతులతో జీవించారని, భారత దేశంలోని ఇతర అన్ని ప్రాంతాలకంటే టిపూ రాజ్యంలోని ప్రజలు సంతోషంగా ఉన్నారని, పంటలు పుష్కలంగా పండాయని ప్రఖ్యాత చరిత్రకారుడు జేమ్స్ మిల్ తన గ్రంథంలో పేర్కొన్నాడు. టిపూ అన్ని మతాలను సమానంగా , గౌరవభావంతో చూసేవాడు. ఈస్టిండియా పాలకులతో పోరాడుతున్నా క్రైస్తవ మతాచార్యులను అమితంగా గౌరవించేవాడు. మసీదు - మందిరాలమధ్య ఎలాంటి తారతమ్యం చూపలేదు. మైసూరు రాజ్యంలోని అనేక ఆలయాలకు ప్రతి ఏడాది గ్రాంటులను , ప్రత్యేక నిధులను మంజూరు చేశాడు. ఈమేరకు టిప్పుసుల్తాన్ 156 ఫర్మానాలను జారీచేశాడు. సైన్యం విషయంలో కూడా టిప్పు ఆదర్శాన్ని నెలకొల్పాడు. ఆయన సైన్యంలోని 19 మంది సేనాపతుల్లో 10 మంది ,13 మంది మంత్రులలో ఏడుగురు హిందువులేనని ప్రఖ్యాత చరిత్రకారుడు బి. ఎన్ . పాండే తనగ్రంథంలో పేర్కొన్నారు. పరమత సహనానికి మారుపేరుగా నిలిచిన టిప్పు సుల్తాన్ అసమాన ధైర్య సాహసాలతో తండ్రికి తగ్గ తనయుడిగా, పిన్నవయసులోనే అనేక విజయాలు సాధించాడు. మలబారు ప్రాంతంలో ప్రారంభమైన ఆ యుద్ధవీరుని జీవితం అటు ఈస్టిండియా కంపెనీతో, ఇటు స్వదేశీ పాలకులైన నిజాం, మరాఠాలతో పోరులోనే గడిచింది. చివరిశ్వాస వరకూ బ్రిటిష్ ముష్కర మూకలను భారతదేశం నుండి తరిమికొట్టడానికి అవిశ్రాంతంగా పోరాడిన ఏకైక స్వదేశీ పాలకుడిగా ఖ్యాతి గడించిన టిప్పు చివరికి ,1799 మే నాల్గవ తేదీన రణ భూమిలోనే తుది శ్వాస వదిలాడు. బ్రిటిష్ అధికారి జనరల్ హ్యారీ టిపూసుల్తాన్ శవాన్ని స్వయంగా పరిశిలించి, మరణించాడని నిర్ధిరించుకున్న తరువాత మాత్రమే 'ఈరోజునుండి భారతదేశం మాది' అని ప్రకటించే సాహసం చేయగలిగాడంటే, ఈ మైసూరు పులి ఆంగ్లేయులకు ఎంత సింహ స్వప్నంగా మారాడో అర్థం చేసుకోవచ్చు. మానవజాతి ఉన్నంత వరకూ టిప్పు అమరత్వం అజరామరంగా నిలిచి ఉంటుంది.

## ఓటర్ స్లిప్పుల పంపిణీ పరిశీలించిన జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని కింది బజార్, వార్డు నెంబర్ మూడు లోని, పోలింగ్ స్టేషన్ 80 పరిధిలో ఓటర్ స్లీప్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు శుక్రవారం పరిశీలించారు. బి ఎల్ వోలు ఇంటింటికి తిరిగి ఓటర్ ఇన్ఫర్మేషన్ సభ్యులు పంపిణీ చేయాలన్నారు. రాజకీయ పార్టీల ఓటర్ లిప్ల పంపిణీ పై సమాచారం అందించాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులతో ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయరాదు అన్నారు. వారితో కలిసి ఓటర్ స్లిప్పులు పంపిణీ చేస్తూ ఫోటోలు దిగరాదని బిఎల్ఓ లకు సూచించారు. ప్రతి ఒక్క ఓటర్కు ఓటర్ స్లిప్పులు పోలింగ్ స్టేషన్ అడ్రస్తో కూడిన వివరాలను ఓటు హక్కు వినియోగం ప్రాధాన్యత స్లిప్పులను పంపిణీ చేయాలని సూచించారు.

**ప్రతి ఒక్క ఓటరు ఓటు హక్కు వినియోగించుకోవాలి..**

ఓటు హక్కు వినియోగించుకోవడం భారతదేశ పౌరుడిగా ప్రతి ఒక్కరి కర్తవ్యం అని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. హోమ్ ఓటింగ్ ఎంపిక చేసుకున్న వ్యక్తులు ఇంటి వద్దనే ఉండి అధికారులకు సహకరించాలని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. 80 సంవత్సరాల పైబడిన వయోవృద్ధులు, వికలాంగులు పోలింగ్ బూత్ కు వరకు వచ్చి ఓటు వేయలేని, నడవలేని స్థితిలో ఉన్నవారికి సాక్ష్యం ఆప్ ద్వారా నమోదు చేసుకున్న వారందరికీ హోం ఓటింగ్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా మిగిలిపోయిన నడవలేని స్థితి లేని లోని వ్యక్తులకు ఉంటే వారి సాక్ష్యం యాప్ లో తమ పేరు వివరాలు నమోదు చేస్తే వారిని అధికారులు పోలింగ్ స్టేషన్ వరకు రవాణా సౌకర్యం కల్పించి ఓటు వేయించి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హోమ్ ఓటింగ్ కోసం ఎంపిక చేసిన వ్యక్తులు ఇంటి వద్దనే ఉండి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయలక్ష్మి, బిఎల్ఓలు సూపర్ వైజర్ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రారంభమైన పోస్టల్ ఓటింగ్: జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు




**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగుల కోసం పోస్టల్ బ్యాలెట్ ను నేటి నుండి ఈనెల 8వ తేదీ వరకు వినియోగించుకోవచ్చని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రాలలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు, ఆయా ఓటర్లు ఎంచుకున్న నియోజకవర్గం ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్లో లేదా అదనపు ఫెసిలిటేషన్ సెంటర్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ కేంద్రాలు పని చేస్తాయన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో సంగారెడ్డి లోని బాలికల జూనియర్ కళాశాలలో ,పటాన్చెరు లో ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని శ్రీ శక్తి భవనంలో, జహీరాబాద్ లో గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో, ఆందోళన ఆర్డీవో కార్యాలయం జోగిపేటలో, నారాయణఖేడ్ లో గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటీషియన్ సెంటర్లు, అదనపు ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు, వీటిని పోస్టల్ కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు వినియోగించుకోవాలని కోరారు.

## యూపీలో తెరపైకి మళ్లీ సోషల్ ఇంజనీరింగ్

**లక్నో :** ఎన్నికల వేళ సమాజంలో కులాలు, మతాలు.. వివిధ నియోజకవర్గాల్లో వారి సంఖ్యాబలం, ఓటుబ్యాంకు వంటి సమీకరణాలు బయటికొస్తాయి. దేశాన్ని పాలించే ప్రధాన మంత్రులను అందిస్తున్న ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలో ఈ కుల, మత సమీకరణాలకు అన్ని రాజకీయ పార్టీలు పెద్ద పీట వేస్తాయి. ఎందుకంటే ఓటర్ల వ్యక్తిగత ఇష్టాయిష్టాలు, విచక్షణ కంటే కులం, మతం ఆధారంగా పార్టీలకు ఓట్లు పడుతుంటాయి. అందుకే ఇక్కడ కులానికొక పార్టీ అన్న చందంగా బలమైన ప్రాంతీయ పార్టీలు ఆవిర్భవించాయి. జాతీయ పార్టీలు సైతం ఈ రాష్ట్రంలో గెలుపొందాలంటే కుల, మత సమీకరణాలు బేరీజు వేసుకోక తప్పదు. రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో గంపగుత్తగా ఓట్లు వేసే సమూహాలుగా దళితులు, ముస్లిం వర్గాలున్నాయి. వారిలో దళితులు రాష్ట్ర జనాభాలో 21.1 శాతం ఉన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 4 దశాబ్దాల పాటు ఈ వర్గం ప్రజలు కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నారు. 1984లో కాన్షీరాం బహుజన్ సమాజ్ పార్టీ ని స్థాపించిన తర్వాత క్రమక్రమంగా ఈ వర్గం బీఎస్పీకి దగ్గరైంది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలు అన్నింటినీ కలిపి బహుజనులుగా సంబోధిస్తూ.. వారి సంక్షేమమే ప్రధాన ఎజెండాగా ఏర్పాటైన ఈ పార్టీని దళితులు పూర్తిగా సొంతం చేసుకున్నారు. అయితే ఇప్పుడు బీఎస్పీ అధినేత్రి మాయావతి గతంలో మాదిరిగా రాజకీయాల్లో క్రియాశీలంగా లేకపోవడం, గత దశాబ్దకాలంలో ఏ ఎన్నికల్లోనూ చెప్పుకోదగిన రీతిలో విజయాలు సాధించలేకపోవడం వంటి కారణాలతో దళితులు మరో ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఆజాద్ సమాజ్ పార్టీ ) పేరుతో చంద్రశేఖర్ ఆజాద్ దళిత ఓటుబ్యాంకును ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ.. దళిత సమాజానికి ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా అవతరించలేకపోయారు.

# ఏ టీచర్‌కు పట్టం కడతారో



**అదిలాబాద్ :** ఆదివాసీల ఖిల్లా ఆదిలాబాద్.. పేరుకు తగ్గట్టుగానే ఆదివాసీ ఓటు బ్యాంక్ ఆధిక్యంతో ఎస్టీ నియోజక వర్గంగా సాగుతోంది. 16,50,175 ఓట్లలో 25 శాతం ఓటు బ్యాంక్?తో నేతల తలరాతలు మార్చే సత్తాతో సాగితోంది గిరిజనం. ఇందులో తొమ్మిది తెగల ఆదివాసీల బలం 2.20 లక్షలైతే.. బంజారా సామాజిక వర్గ బలం 1.50 లక్షలుగా ఉండటంతో.. ఈ రెండు సామాజిక వర్గాలను ఒక్క తాటిపైకి తెచ్చి గంపగుత్తగా ఓటు బ్యాంకును తమ ఖాతాలో వేసుకోవడం అంత ఈజీ కాదన్న టాక్ నడుస్తోంది. కారణం ఆదివాసీ ? బంజారా?ల మధ్య గత కొంత కాలంగా కోల్డ్ వార్ కొనసాగుతుండటం.. తాజా పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాన పార్టీలేవి బంజారా నేతలకు అవకాశం కల్పించకపోవడం. దీంతో నివురుగప్పిన నిప్పులా సాగుతున్న బంజారా సామాజిక వర్గం ఉప్పెనలా ముంచి ఏ పార్టీ కొంప కొల్లేరు చేస్తుందో అన్న ఆందోళన రాజకీయ వర్గాల్లో కనిపిస్తోంది. మరో వైపు తొమ్మిది తెగలతో కొనసాగుతున్న ఆదివాసీలను ఐక్యం చేసి గంపగుత్తగా ఓటు బ్యాంకును సొంతం చేసుకోవడం కూడా అంత ఈజీ కాకపోవడంతో.. ఆదివాసీల ఖిల్లాను హస్తగతం చేసుకునేం దుకు ఎర్రని ఎండలను సైతం లెక్క చేయకుండా చెమటోడ్చక తప్పని పరిస్థితి అన్ని పార్టీలది. అయితే ఈ ఎన్నికల్లో మూడు పార్టీలు కూడా ఆదివాసీ నేతకు.. అందులో గోండు సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థికే పట్టం కట్టడంతో.. ఏ నేతకు జై కొట్టాలో తెలియక ఆదివాసీ సమాజం అయోమయంలో పడిపోయింది. గత 2019 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ తరుపున పోటీ చేసిన సోయం బాపురావును భుజాలపై మోసీ గెలిపించుకున్న ఆదివాసీ సామాజిక వర్గం మారిన రాజకీయ పరిణామాలకు తోడు.. ప్రదాన పార్టీల అభ్యర్థులందరు ఆదివాసీ నేతలే కావడంతో గంపగుత్తగా ఒక వైపే నిలిచే అవకాశాలు కష్టమే అన్న టాక్ వినిపిస్తోంది.అయితే ఆదివాసీల కోసం పోరాటాలు చేసిన నేతల్లో ముందు వరుసలో ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు వైపే ఆదివాసీ సమాజం నిలుస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ఇదే సమయంలో బంజారా సమాజం మరో వైపు నిలుస్తుండటంతో గెలుపు అంత ఈజీ కాదన్న టాక్ నడుస్తోంది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిదిలోని ఏడునియోజక వర్గాల్లో బీఆర్ఎస్ కేవలం ఆసిఫాబాద్, బోథ్ నియోజకవర్గాలను మాత్రం సొంతం చేసుకోవడం.. ఆ రెండు నియోజక వర్గాలు కూడా ఎస్టీ రిజర్వ్ నియోజకవర్గాలే కావడంతో పార్లమెంట్ ఎన్నికల్లోను ఎస్టీ సామాజిక వర్గం తమ వైపే నిలుస్తుందన్న భారీ ఆశలతో ఉంది బీఆర్ఎస్. అయితే కాంగ్రెస్ మాత్రం ఒకే ఒక్క ఖానాపూర్ సీటును గెలుచుకున్నప్పటికి.. గెలిచిన ఆ ఒక్క నేత ఆదివాసీ ఉద్యమకారుడే కావడంతో గిరిజన ఓటర్ల బలం బలగం తమకే ఉందంటూ చెప్పుకొస్తోంది కాంగ్రెస్.మరో వైపు ఆదిలాబాద్ పార్లమెంట్ హస్తం గెలుపు బాధ్యతలు భుజానకెత్తుకున్న మంత్రి సీతక్క.. తమ సామాజిక వర్గ ఓట్లను గంప గుత్తగా కైవసం చేసుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తుండటం.. అభ్యర్థి ఆత్రం సుగుణ సైతం ఆదివాసీ ఉద్యమకారురాలు కావడంతో తమకే ఎక్కువ అవకాశాలు అన్న ఆశభావం వ్యక్తం చేస్తోంది కాంగ్రెస్. అయితే బీజేపీ నేత గోడెం నగేష్ బలమైన ఆదివాసీ నాయకుడే అయినా ఆదివాసీ ఉద్యమంలో అంటీముంటన్నట్టుగానే సాగాడన్న అపవాదుతో ఆ సామాజిక వర్గం దూరంగానే ఉంటూ వస్తోంది. అయితే అనూహ్యంగా మోడీమానియాతో బంజారా సామాజిక వర్గం బీజేపీ వైపు నిలుస్తుందన్న టాక్ నేపథ్యంలో ముచ్చటగా మూడు పార్టీలు ఆదివాసీ ఓట్లను చీల్చుకుని బంజారా ఓట్లు బీజేపీ చేజిక్కుంచుకుంటే కాషాయానికి ఆదివాసీల ఖిల్లాలో తిరుగుండదనే చర్చ సాగుతోంది. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని 16,50,175 లక్షల ఓట్లలో మైనారిటీ బలం సైతం 1.50 లక్షల ఓటర్లు ఉండటం.. ఈ ఓట్లలలో ఒక్క శాతం ఓటు బ్యాంకు కూడా బీజేపీకి దక్కే అవకాశం లేదని తెలుస్తోంది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో 4,48,961 ఓట్లను సాధించుకున్న బీజేపీ.. పార్లమెంట్ ఎన్నికల్లో ఈ టార్గెట్?ను క్రాస్ చేస్తుందా లేక మారిన పరిణామాలతో ఓట్లను నష్టం పో తుందో చూడాలి. మరో వైపు అసెంబ్లీ ఎన్నికల్లో 4,65,476 ఓట్లను సాధించిన బీఆర్ఎస్ కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్?తో క్యాడర్?ను కోల్పోయి ఢీలా పడగా.. శాసనసభ ఎన్నికల్లో కేవలం ఒక్క ఖానాపూర్?ను మాత్రమే కైవసం చేసుకుని ఏడు నియోజక వర్గాల్లో 2,25,286 ఓటు బ్యాంక్ ను మాత్రమే దక్కించుకున్న కాంగ్రెస్.. గోడ దూకొచ్చిన కీలక నేతల బలం తో ఆదివాసీల అండదండలతో గెలిచి నిలుస్తుందో చూడాలి.

# ఆఫ్ లైన్‌లోనే ప్రిలిమ్స్



తెలంగాణలో గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణకు సంబంధించి టీఎస్పీఎస్సీ కీలక అప్‌డేట్ ఇచ్చింది. గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షను ఆఫ్‌లైన్ విధానంలోనే నిర్వహించనున్నట్లు మే 1న ఒక ప్రకటనలో తెలిపింది. ప్రిలిమ్స్ పరీక్షను ఓఎంఆర్(రాఓఫ్ఫీ) విధానంలోనే నిర్వహించనున్నట్లు ఖాఖూఅ స్పష్టం చేసింది. ప్రకటించిన షెడ్యూలు ప్రకారం.. జూన్ 9న గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షను, అక్టోబర్ 21న మెయిన్స్ పరీక్ష నిర్వహించనున్నట్లు టీఎస్పీఎస్సీ ఇప్పటికే వెల్లడించింది. పరీక్షలకు వారం ముందు నుంచి హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచుతారు. పరీక్ష సమయానికి 4 గంటల ముందువరకు హాల్‌టికెట్లు అందుబాటులో ఉండనున్నాయి. తెలంగాణలో గ్రూప్–1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడిన సంగతి తెలిసిందే. మొత్తం 563 పోస్టుల భర్తీకీ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫిబ్రవరి 19న నోటిఫికేషన్ విడుదల చేసింది. అభ్యర్థుల నుంచి ఫిబ్రవరి 23 నుంచి మార్చి 16న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించారు. గ్రూప్–1 పరీక్ష కోసం మొత్తం 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం ఇటీవలే ప్రభుత్వ ఉద్యోగాలకు వయోపరిమితిని 2 సంవత్సరాలకు పొడిగించిన సంగతి తెలిసిందే. దీంతో గరిష్ఠవయోపరిమితి 44 సంవత్సరాల నుంచి 46 సంవత్సరాలకు చేరింది. అయితే నిబంధనల మేరకు వయోపరిమితిలో సడలింపులు వర్తించను న్నాయి. రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు 5 సంవత్సరాలు, ఎక్స్–సర్వీ?స్‌మెన్ అభ్యర్థులకు 3 సంవత్సరాలు, ఎన్‌సీసీ అభ్యర్థులకు 3 సంవత్సరాలు, ఎస్సీ–ఎస్టీ–బీసీ–ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాల వరకు వయోసడలింపు ఉంటుంది.

పరీక్ష విధానం: మొత్తం 150 మార్కులకు ప్రిలిమ్స్ పరీక్ష (జనరల్ స్టడీస్ ఱ మెంటల్ ఎబిలిటీ), 900 మార్కులకు మెయిన్ (6 పేపర్లు) పరీక్షలు నిర్వహిస్తారు. ఒక్కో పేపరుకు 150 మార్కులు ఉంటాయి. ఇక మెయిన్ పరీక్షలో 150 మార్కులకు జనరల్ ఇంగ్లిష్ అర్హత పరీక్ష నిర్వహిస్తారు.

ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలు: ఆసిఫాబాద్–కొమ్రంభీమ్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల–రాజన్న, సిద్ధిపేట, మెదక్, కామారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, సూర్యాపేట, నల్గొండ, భువనగిరి–యాదాద్రి, జనగాం, మేడ్చల్–మల్కాజ్‌గిరి, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ–గద్వాల్, వనపర్తి, నాగర్‌కర్నూల్.

మెయిన్ పరీక్ష కేంద్రాలు: ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, నల్గొండ.

# దుబాయ్‌లో వానలే.. వానలు



**న్యూఢిల్లీ :** తీవ్ర ఎండలతో ఎప్పుడూ ఉక్కిరిబిక్కిరయ్యే దేశం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్. కొన్ని రోజులుగా అక్కడి వాతావరణంలో అనూహ్య వాతావరణ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. గత నెల(ఏప్రిల్)లో ఈ ఎడారి దేశాన్ని కుంభవృష్టి వణికించింది. నెల రోజులు తిరగకుండానే మళ్లీ ఇక్కడ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు విమాన సర్వీసులను అధికారులు రద్దు చేశారు.దుబాయ్‌లో వాతావరణం మారిపోయింది. దుబాయ్, అబుదాబీసహా పలు నగరాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరదల ప్రభావంతో దుబాయ్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో పలు విమానాలు రద్దయ్యాయి. కొన్ని ఆలస్యంగా నడుస్తున్నాయి. శుక్రవారం వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.అంతర్జాతీయ విమానాల రదు?ద నేపథ్యంలో పలు విమానయాన సంస్థలు తమ ప్రయాణికులకు ట్రావెల్ అడ్వైజరీ జారీ చేశాయి. 'దుబాయ్, షారా?జ, అబుదాబీలో ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో విమాన సేవలకు ఆటంకం కలుగుతోంది.. ఎయిర్‌పోర్టుకు బయల్దేరేముందు మీ విమాన స్టేటస్ చెక్ చేసుకోండి' అని ఇండిగో వెల్లడించింది. విస్తారా, స్పైస్ జెట్ కూడా ఇలాంటి సూచనలు చేశాయి. మే 5వ తేదీ వరకు విమానాలు ఆలస్యం లేదా రద్దయ్యే అవకాశముందని తెలిపారు. ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ అందిస్తామని పేర్కొన్నాయి.గత ఏప్రిల్ 14, 15 తేదీల్లో యూఈఏని భారీ వర్షాలు ముంచెత్తాయి. దుబాయ్ నగరంలో ఏడాదిన్నరలో కురవాల్సిన వర్షం కొన్ని గంటల్లోనే కురిసింది. 1949 తర్వాత గత నెలలోనే ఇక్కడ రికార్డుస్థాయిలో వర్షం కురిసిందని అధికారులు వెల్లడించారు. గత నెలతో పోలిస్తే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తక్కువే అయినా.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# సపోటా జ్యూస్‌తో అలాంటి సమస్యలకు చెక్!



వేసవికాలంలో ఎక్కువ మంది తరచూ జ్యూసులు తాగుతూ ఉంటారు.. మరి కొంత మంది సోడాలు, కొబ్బరి బోండాలు, చెరుకు రసం వంటివి కూడా తాగుతూ ఉంటారు. అయితే సపోటా జ్యూస్ ని కూడా తాగే వారు చాలా తక్కువ మందే ఉంటారు.వీటిని జ్యూస్గా షుగర్ పేషెంట్లు చేసుకొని మాత్రం తాగకూడదట. ఎందుకంటే దీని వల్ల షుగర్ లెవెల్స్ మరింత ఎక్కువ అవుతాయని నిపుణులు తెలియజేస్తున్నారు. వీటితో పాటు డైట్ లో ఉన్నవారు మాత్రం అసలు వీటిని ముట్టుకోకపోవడమే మంచిదట. మరి సపోటా జ్యూస్ ని తాగడం వల్ల కలిగే ప్రయోజనాలను ఇప్పుడు ఒకసారి చూద్దాం.సపోటా జ్యూస్ లో ఎక్కువగా ఫైబర్ ఉండడం వల్ల జీర్ణవ్యవస్థను కూడా ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది. దీనివల్ల మలబద్ధక సమస్యను కూడా మనం నివారించుకోవచ్చు.సపోటా జ్యూస్ తాగడం వల్ల ఇందులో ఉండే పొటాషియం గుండె కండరాల పనితీరును కూడా మెరుగుపరడానికి ఉపయోగపడుతుంది. అలాగే రక్తపోటును కూడా నియంత్రించడానికి సహాయపడుతుంది. సపోటా జ్యూస్ తరచూ తాగడం వల్ల ఇందులో ఉండే క్యాల్షియం ఎముకలను బలోపేతంగా చేయడానికి ఉపయోగపడుతుంది. విటమిన్ ఏ సపోటాలో ఉండడం వల్ల కంటి సమస్యలను కూడా దూరం చేస్తుందట. అలాగే జలుబు ఫ్లూ వంటి వాటిని కూడా దరికి చేరనివ్వకుండా పోరాడేటువంటి శక్తి ఇస్తుంది.జుట్టు రాలిపోతున్న సమస్యతో ఇబ్బంది పడేవారు వారానికి ఒక్కసారైనా సపోటా జ్యూస్ తాగడం వల్ల జుట్టు ఒత్తుగా పెరుగుతుంది. సపోటా జ్యూస్ ని తాగడం వల్ల తలలో బ్లడ్ సర్క్యులేషన్ చాలా చురుకుగా ఉంటుందట.అలాగే శరీరంలోని అవయవాలు కూడా చాలా ఆరోగ్యంగా పనిచేస్తాయని నిపుణులు తెలియజేస్తున్నారు. మగవారు సపోటా జ్యూస్ ను ఎక్కువగా తాగడం వల్ల మంచి లాభాలు కలిగి ఉంటాయి.

# ఈ లక్షణాలు కనిపిస్తే ప్రతిరోజూ క్యాల్షియం సప్లిమెంట్లు తీసుకోవాలని అర్థం



మన శరీరంలో క్యాల్షియం ముఖ్యమైన పోషకం. ఎముకలు బలంగా ఉండాలన్నా, దంతాలు దృఢంగా ఉండాలన్నా, గుండెతో సహా కండరాల సంకోచాలను నియంత్రించాలన్నా, నరాల వ్యవస్థ ఆరోగ్యంగా ఉండాలన్నా...అన్నింటికీ క్యాల్షియం అవసరం పడుతుంది. హార్మోన్ల ఉత్పత్తిలో, కణాల సిగ్నలింగ్ వ్యవస్థలో, ఎంజైముల పనితీరులో క్యాల్షియం పాత్ర ముఖ్యమైనది. అయితే శరీరంలో ఎప్పుడైతే కాల్షియం తగ్గుతుందో.. అది కొన్ని సంకేతాల ద్వారా మనకు ఆ విషయాన్ని తెలియజేస్తుంది. అప్పుడు వైద్యులను సంప్రదించి ప్రతిరోజూ క్యాల్షియం సప్లిమెంట్లు తీసుకోవడం చాలా అవసరం. కండరాల పనితీరుకు కాల్షియం కీలకమైనది. క్యాల్షియం స్థాయిలు తక్కువగా ఉంటే కండరాలు సరిగా పనిచేయలేవు. కండరాల్లో తిమ్మిరి పట్టడం అధికమవుతుంది. నీరసంగా అనిపిస్తుంది. అలాగే ఏదైనా పని చేస్తున్నప్పుడే కాదు, విశ్రాంతి తీసుకున్నప్పుడు కూడా కాళ్లు, పాదాలు, చేతుల్లోని కండరాలలో తిమ్మిరిగా అనిపించవచ్చు.కాలుష్యం తగ్గడం వల్ల నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుంది. శరీరం జలదరించినట్టు అనిపిస్తుంది. వేళ్లు, కాళ్లు, పెదవులు, నాలుక వంటి భాగాల చివర సూదులతో పొడిచినట్టు అనిపిస్తుంది. క్యాల్షియం స్థాయిలు తగ్గితే నరాల పనితీరులో అంతరాయం కలుగుతుంది. కాల్షియం స్థాయిలు తగ్గితే కండరాలు బలహీనంగా మారుతాయి. దీనివల్ల తీవ్ర అలసటగా అనిపిస్తుంది. ఏ పనీ చేయాలనిపించదు. చేతులు, కాళ్లల్లో ఉన్న కండరాలు సహకరించవు. బద్ధకంగా అనిపిస్తుంది.వేలి గోళ్లు కూడా మన ఆరోగ్యాన్ని సూచిస్తాయి. క్యాల్షియం స్థాయిలను గోళ్ల ద్వారా తెలుసుకోవచ్చు. శరీరంలో తగినంత కాల్షియం లేకపోతే గోళ్లు పెళుసుగా మారిపోతాయి. గోళ్ల చివర్లు విరిగిపోతూ, చీలిపోతూ ఉంటాయి. అవి ఆరోగ్యంగా, అందంగా కనిపించవు.క్యాల్షియం అనేది దంతాల ఎనామెల్‌లో ముఖ్యమైన భాగం. ఇది దంతాల పై పొరను రక్షిస్తూ ఉంటుంది. కాల్షియం తగినంత అందకపోతే ఎనామిల్ బలహీనపడుతుంది. దంత క్షయం వంటి సమస్యలు వస్తాయి. త్వరగా దంతాలు ఊడిపోతాయి. అలాగే చిగుళ్ల వ్యాధి కూడా రావచ్చు. బలమైన ఆరోగ్యకరమైన ఎముకలు కోసం క్యాల్షియం చాలా కీలకం. దీర్ఘకాలికంగా కాల్షియం లోపిస్తే ఎముక బలహీనంగా మారుతుంది. దీనివల్ల ఆర్థరైటిస్ వంటి వ్యాధులు రావచ్చు. గుండె కొట్టుకునే వేగాన్ని నియంత్రించే విద్యుత్ ప్రేరణలను నియంత్రించే శక్తి క్యాల్షియంకి ఉంది. క్యాల్షియం స్థాయి తక్కువగా ఉన్నప్పుడు గుండె లయలో అంతరాయాలు ఏర్పడతాయి. దీనిని కార్డియాక్ అరిథ్మియా అని పిలుస్తారు. దీనివల్ల గుండె దడ రావడం, హృదయ స్పందనలు క్రమ రహితంగా ఉండడం, ఛాతీలో కాస్త నొప్పి రావడం వంటివి జరుగుతాయి.

# నచ్చినట్టు డ్యాన్స్ చేస్తే ఏం జరుగుతుందో తెలుసా?



డ్యాన్స్ అనేది ఓ కళ. డ్యాన్స్ చేయడంలో ఒకొక్కరి స్టైల్ ఒక్కో విధంగా ఉంటుంది. కొంత మంది క్లాసికల్ డ్యాన్స్ చేస్తే, ఇంకొందరు మాస్ డ్యాన్స్ చేస్తారు.కానీ కొందరు మాత్రం తమకు ఎలా చేయాలనిపిస్తే అలా చేసి ఎంజాయ్ చేస్తారు. అయితే డ్యాన్స్ ఎలా చేసినా మంచిదే కానీ.. తప్పకుండా డ్యాన్స్ చేయాలంట. మీకు నచ్చినట్టు డ్యాన్స్ చేయడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. అవి ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. డ్యాన్స్ చేయడం వలన మానసికంగా, శారీరకంగా చాలా ఆరోగ్యంగా ఉంటారు అంటున్నారు నిపుణులు. రోజులో ఒక్కసారైనా డ్యాన్స్ చేయడం వలన రక్త ప్రసరణ మెరుగుపడి గుండె జబ్బులు రాకుండా ఉంటాయంట. అంతేకాకుండా , ఊబకాయం, అధిక బరువుతో బాధపడుతున్న వారు ప్రతి రోజు కొద్ది సేపు డ్యాన్స్ చేయడం వలన బరువు తగ్గుతారంట. కొంతమంది ఒంటరితనంతో బాధపడిపోతుంటారు. అలాంటి వారు సాంగ్స్ పెట్టుకొని డ్యాన్స్ చేయడం వలన మానసికంగా దృఢంగా, ఆరోగ్యంగా ఉండవచ్చు. అంతే కాకుండా వేరే వారితో కలిసి డ్యాన్స్ చేయడం వలన సామాజిక సంబంధాలు పెరిగి, స్నేహ భావం పెపొందుతుందంట. అలాగే డ్యాన్స్ కండరాలను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అంతే కాకుండా డ్యాన్స్ క్రమం తప్పకుండా చేయడం వలన .. మానసిక స్థితిని మెరుగు పరిచి, ఒత్తిడి స్థాయిలను తగ్గిస్తుందంటున్నారు నిపుణులు. శారీరక శ్రమ, లయబద్ధమైన కదలిక, సంగీతం కలయిక మనసుకు మంచిది. దీని వలన ఎండార్ఫిన్లను విడుదలవుతాయి. ఇది ఆందోళన, నిరాశ భావాలను తగ్గించడంలో సహాయపడుతుంది. అందువలన మీకు డ్యాన్స్ రాదు అని భయపడకుండా, మీకు నచ్చినట్టు రోజులో ఒక్కసారైనా డ్యాన్స్ చేయాలి అంటున్నారు నిపుణులు.

# విటమిన్ డి లభించే ఫుడ్‌లను తీసుకోండి




శరీరానికి తగినన్ని ప్రోటీన్లు, విటమిన్లు అందితేనే ఆరోగ్యంగా ఉంటాము. మినరల్స్ వంటివి కూడా చాలా అవసరం. కానీ బిజీ షెడ్యూల్ వల్ల, అధిక పనుల వల్ల ఆరోగ్యం మీద దృష్టి పెట్టడం లేదు చాలా మంది.దీంతో ఆసుపత్రుల సంఖ్య, రోగిస్టుల సంఖ్య పెరుగుతుంది. ఇక ఫ్రీగా వచ్చే విటమిన్ డి గురించి, దాని ప్రయోజనాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మరి ఈ విటమిన్ డి ఉదయం వచ్చే సూర్య కిరణాల వల్లనే కాదు కొన్ని తక్కువ ధరలో లభించే ఫుడ్ లలో కూడా ఉంటుంది. అవేంటి అంటే.. విటమిన్ డి లోపం వల్ల చర్మం, ఎముకలు, రోగనిరోధక శక్తి మీద ప్రభావం పడుతుంది. అందుకే విటమిన్ డి రిచ్ ఫుడ్స్ ను తీసుకోవాలి. ఎముకల ఎదుగుదలకు, రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి, కణాల పెరుగుదల, అభివృద్ధికి తోడ్పడుతుంది విటమిన్ డి. ఈ విటమిన్ డి కొన్ని సహజమైన ఆహారాలలో, లేదంటే సప్లిమెంట్స్ ద్వారా లభిస్తుంది. గుడ్డులోని పచ్చసొన లో కూడా విటమిన్ డి ఉంటుంది. ఒక గుడ్డులోని పచ్చసొనలో 37 ఐయూ విటమిన్ లభిస్తుంది. ఒక 3.5 ఔన్స్ సాల్మన్ ఫిల్లెట్లు 450 ×ఖ విటమిన్ ఉంటుంది. సాల్మాన్, ట్యూనా, సార్డిన్, మకారూన్, హెర్రింగ్ వంటి చేపల్లో విటమిన్ డి పుష్కలంగా ఉంటుంది. శరీరంలో అతి ముఖ్యమైన పోషకాల్లో విటమిన్ డి కూడా ఒకటి కాబట్టి కచ్చితంగా రోజు వారి ఆహారంలో ఈ విటమిన్ ఉండేలా చేసుకోవాలి. వీటి కోసం పుట్టగొడుగులు, ఆవు పాలు కూడా తీసుకోవచ్చు. ఇక ఉదయం కాసేపు ఎండలో నిల్చొంటే చాలు ఫ్రీగా మీకు విటమిన్ డి వచ్చేస్తుంది. కాబట్టి ఫ్రీగా వచ్చే ఈ విటమిన్ ను కాదనకుండా ఉదయం ఎండలో నిల్చొండి. కొన్ని ఆహార పదార్థాలు కూడా తీసుకోండి.

# బరువు తగ్గడం కోసం ఈ పనులు చేస్తే డేంజరే..



ఊబకాయం, అధిక బరువు సమస్య ప్రపంచవ్యాప్తంగా తీవ్రమవుతుంది. దీని బారిన పడే వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. జీవనశైలిలో మార్పులు, ఆహారపు అలవాట్లు, ఇతర ఆరోగ్య సమస్యలే దీనికి ప్రధాన కారణమని తెలుస్తోంది. అధిక బరువు ఉన్నవారు ఈ సమస్య నుంచి బయటపడేందుకు అనేక ప్రయత్నాలు చేస్తుంటారు. ప్రత్యేకమైన ఆహారం, కొన్ని మందులు తీసుకోవడం, శిక్షణ.. ఇలా తమకు నచ్చిన పద్ధతులను అనుసరిస్తారు. కొందరు రాత్రి భోజనాన్ని మానేస్తారు. అయితే ఇది చాలా ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారు. రాత్రి భోజనం శరీరానికి చాలా ముఖ్యం. పడుకునే ముందు శరీరానికి ముఖ్యమైన కేలరీలు, పోషకాలను అందిస్తుంది. 24 గంటల కాలచక్రంలో శరీరం ఎక్కువ సమయం తినకుండా నిద్రపోతుంది. కాబట్టి రాత్రి భోజనం చాలా ముఖ్యం. బరువు తగ్గడానికి డిన్నర్ స్కిప్ చేయడం వల్ల స్వల్పకాలంలో ప్రయోజనాలు ఉండవచ్చు. అయితే, దీర్ఘకాలంలో ఇది మీ ఆరోగ్యానికి మంచిది కాదు. ఈ అలవాటు వల్ల రకరకాల అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇది మీ మొత్తం ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ఎందుకంటే రాత్రి భోజనం మానేయడం మీ జీవక్రియను ప్రభావితం చేస్తుంది. ఆకలి కోరికలను పెంచుతుంది. ఇది సూక్ష్మపోషకాల లోపానికి దారితీస్తుంది. రాత్రి భోజనం తినకపోవడం వల్ల మీ నిద్ర నాణ్యతపై ప్రభావం చూపుతుంది. మీ శరీరం యొక్క శక్తి స్థాయిలను తగ్గిస్తుంది.

# ఉడకబెట్టిన వేరుశనగల ప్రయోజనాలు



వేరుశనగ ఉపయోగాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దీని వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయి. ఇందులో చాలా పోషకాలు ఉంటాయి. పలు రకాల వంటకాల్లో కూడా వేరుశనగను ఉపయోగిస్తారు.దీన్ని తినడం వల్ల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కొందరు స్నాక్స్ లాగా తింటే మరికొందరు వేయించుకొని తింటారు. మరికొందరు ఇతర స్వీట్ల మాదిరి చేసుకొని తింటారు. అయితే వేరు శనగను ఉడకబెట్టి తినడం వల్ల ఆరోగ్యానికి మరింత మంచిది అంటున్నారు నిపుణులు. మరి అవేంటో తెలుసుకోండి. మెదడు ఆరోగ్యం.. వేరుశనగ తినడం వల్ల మెదడు షార్ప్ గా ఉంటుందట. బ్రెయిన్ ఆరోగ్యానికి చాలా మంచిది. ఇక ఉడకబెట్టిన పల్లీలు తింటే మెదడు పనితీరు మెరుగుపడటమే కాదు యాక్టీవ్ గా ఉంటుందట. మతిమరుపు సమస్య తగ్గి జ్ఞాపక శక్తి పెరుగుతుంది. పిల్లలకు ఇవ్వడం వల్ల బ్రెయిన్ పెరుగుదల బాగుంటుంది అంటున్నారు నిపుణులు. బరువు నియంత్రణ.. ఉడకబెట్టిన పల్లీల వల్ల బరువు నియంత్రణలో ఉంటుంది. వీటిలో కేలరీలు తక్కువగా, ఫైబర్, ప్రోటీన్ లు ఎక్కువగా ఉంటాయి. కొద్దిగా తీసుకున్నా కడుపు నిండిన భావన ఉంటుంది. దీని వల్ల ఆహార పదార్థాలు తీసుకోరు కాబట్టి వెయిట్ లాస్ అవుతారు. యాంటీ ఆక్సిడెంట్లు.. ఉడకబెట్టిన వేరుశనగ లో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. వీటి వల్ల చర్మానికి, ఆరోగ్యానికి, జుట్టుకు మంచిది. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్ తో పోరాడుతాయి. అదే విధంగా ఆక్సిడేటివ్ స్ట్రెస్ ను కూడా తగ్గిస్తాయట. బ్లడ్ షుగర్.. ఉడకబెట్టిన పల్లీలు తినడం వల్ల బ్లడ్ షుగర్ కంట్రోల్ అవుతుంది అంటున్నారు నిపుణులు. చక్కెర స్థాయిలను తగ్గించి ప్రోటీన్, ఫైబర్ మెండుగా ఉండి తక్కువ క్యాలరీలు లభిస్తాయి. కాబట్టి డయాబెటీస్ ఉన్నవారు ఉడకబెట్టిన పల్లీలు తినడం చాలా మంచిది.

# స్థానిక వార్తలు

## 8 నుంచి ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపిఒ





**న్యూఢిల్లీ:** ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ) మే 8 నుంచి ప్రారంభం కానుందని ఆ సంస్థ తెలిపింది. 10న ముగియనున్న ఈ ఇష్యూలో రూ.3,000 కోట్లు సమీకరించాలని కంపెనీ నిర్దేశించుకుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 7న ఇష్యూ ప్రారంభం కానుంది. ఈ ఇష్యూ వివరాలను గురువారం బ్లాక్‌స్టోన్ సీనియర్ అధికారులు అమిత్ దీక్షిత్, ముకేష్ మెహతా, ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ ఎండి రిషి ఆనంద్ మీడియాకు వెల్లడించారు. ఈ ఇష్యూలో భాగంగా రూ.1,000 కోట్ల విలువైన తాజా షేర్లను జారీ చేయడంతో పాటు ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిలో ప్రమోటరు బిసిపి టోప్కో 7 పిటిఇ లిమిటెడ్ రూ.2,000 కోట్ల విలువైన షేర్లను విక్రయించనుంది. ప్రస్తుతం ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్‌లో బ్లాక్‌స్టోన్ గ్రూపునకు చెందిన బిసిపి టోప్కోకు 98.72 శాతం, ఐసిఐసిఐ బ్యాంక్‌కు 1.18 శాతం చొప్పున వాటాలున్నాయి.

## అదరగొట్టిన కోల్ ఇండియా




**కోల్‌కత్తా :** ప్రభుత్వ రంగంలోని కోల్ ఇండియా ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు సాధించింది. వివిధ ఎజెన్సీల అంచనాలకు మించి నికర లాభాలు ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24) జనవరి నుంచి మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 26 శాతం వృద్ధితో రూ.8,682 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. 2022-23 ఇదే క్యూ4లో రూ.6,869.5 కోట్ల లాభాలు ప్రకటించింది. ఓపెన్ కాస్ట్ మైనింగ్ పెంచుకోవడంతో పాటు వ్యయాలను తగ్గించడంతో గడిచిన త్రైమాసికంలో మెరుగైన ఫలితాలను సాధించింది. దేశంలోని మొత్తం బొగ్గు ఉత్పత్తిలో ఈ పిఎస్‌యు 80 శాతం వాటాను కలిగి ఉంది. కాగా.. గడిచిన క్యూ4 కంపెనీ రెవెన్యూ 2 శాతం పెరిగి రూ.37,410 కోట్లకు చేరింది. ఏడాదిక్రితం ఇదే సమయంలో రూ.38.152 కోట్ల రెవెన్యూ నమోదు చేసింది. 2023-24కు గాను తుది డివిడెండ్ కింద ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.5 డివిడెండ్‌ను అందించడానికి ఆ కంపెనీ బోర్డు ప్రతిపాదించింది. క్రితం ఆర్థిక సంవత్సరంలో కోల్ ఇండియా మొత్తం లాభాలు 18 శాతం పెరిగి రూ.37,402 కోట్లకు చేరాయి. 2022-23లో రూ.31,763 కోట్ల లాభాలు ఆర్జించింది. ఇదే సమయంలో కంపెనీ రెవెన్యూ రూ.1.38 లక్షల కోట్లుగా ఉండగా.. గడిచిన 2023-24లో 3 శాతం పెరిగి రూ.1.42 లక్షల కోట్లుగా చోటు చేసుకుంది.

# చైనా నుంచే ఎలక్ట్రానిక్స్, టెలికాం, విద్యుత్తు ఉత్పత్తులు



**న్యూఢిల్లీ:** గత ఆర్థిక సంవత్సరంలో మన ఎలక్ట్రానిక్స్, టెలికాం, ఎలక్ట్రికల్ ఉత్పత్తుల దిగుమతులు 89.8 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.7.45 లక్షల కోట్లు)గా నమోదయ్యాయి. ఇందులో సగానికి పైగా (56%) చైనా, హాంకాంగ్ దేశాల నుంచే దిగుమతి అయ్యాయని ఆర్థిక మేధో సంస్థ జీటీఆర్ఐ తన నివేదికలో పేర్కొంది. చైనా నుంచే 43.9% ఎలక్ట్రానిక్స్, టెలికాం, విద్యుత్తు ఉత్పత్తులు వచ్చాయని వివరించింది. ఈ ఉత్పత్తుల కోసం ఈ రెండు దేశాలపై ఎన్నో ఏళ్లుగా భారత్ ఆధారపడి ఉందని తెలిపింది. ఈ దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకుంటేనే ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు, భారత డిజిటల్, సాంకేతిక సార్వభౌమత్వాన్ని రక్షించుకోగలమని ఆ నివేదిక అభిప్రాయపడింది. ఈ వస్తువుల కోసం చైనాపై ఆధారపడటం కొనసాగితే, అది దేశ వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి, ఆర్థిక భద్రతకు సవాళ్లను విసరగలదని హెచ్చరించింది. దేశీయ ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకోవడంతో పాటు, వివిధ వస్తువుల కోసం వ్యూహాత్మకంగా ఇతర దేశాల వైపు మళ్లాలని సూచించింది. ఎలక్ట్రానిక్స్ విభాగంలో ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ల దిగుమతి 2007-10 మధ్య 166.1 మి. డాలర్లు (సుమారు రూ.1380 కోట్లు)గా ఉండగా.. 2020-2022 కల్లా 4.2 బి. డాలర్ల (సుమారు రూ.35,000 కోట్ల)కు పెరిగింది. కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లలో వీటి వాడకం ఎక్కువ. ఫోన్లు, ఇతర వైర్‌లెస్ పరికరాల వంటి కమ్యూనికేషన్ డివైజెస్‌ల దిగుమతులు 3.691 బిలియన్ డాలర్ల (సుమారు రూ.30,700 కోట్ల)కు పెరిగాయి. ఈ మార్కెట్‌లో సగం వాటా చైనాదే. డయోడ్లు, ట్రాన్సిస్టర్లు, ఇదే తరహా సెమీకండక్టర్ డివైజెస్‌ల దిగుమతులు కూడా 113.3 మి. డాలర్ల (సుమారు రూ.940 కోట్ల) నుంచి 2334.8 మి. డాలర్ల (సుమారు రూ.19,400 కోట్ల)కు దూసుకెళ్లాయి. ఇందులో చైనా వాటా 67.5%. బ్యాటరీలు, ఇతరత్రా ఎలక్ట్రిక్ అక్యుములేటర్ల దిగుమతులు 254.2 మి. డాలర్ల (సుమారు రూ.2110 కోట్ల) నుంచి 1.4 బి. డాలర్ల (సుమారు రూ.11,600 కోట్ల)కు చేరగా.. ఇందులోనూ చైనాదే అధిక వాటా. ఈ నేపథ్యంలో చైనాపై ఆధారపడడం తగ్గించుకోవాలని.. ఇది అత్యంత ప్రాధాన్యత, వ్యూహాత్మక అంశంగా గుర్తించాలని ఆ నివేదిక వివరించింది. దేశీయంగా సెమీకండక్టర్ తయారీని అభివృద్ధి చేసుకోవాలని తెలిపింది. డయోడ్లు, ట్రాన్సిస్టర్లు, ఎలక్ట్రిక్ అక్యుములేటర్ల స్థానిక తయారీ వేగవంతం చేయాలని.. ఇందు కోసం అంతర్జాతీయ టెక్ కంపెనీలతో సాంకేతిక బదిలీ/సంయుక్త సంస్థల స్థాపన దిశగా ఆలోచించాలని సూచించింది.

# ప్రీమియం స్కూటర్లను రిలీజ్ చేసిన ఆంపియర్



ప్రపంచవ్యాప్తంగా ఈవీ స్కూటర్లకు డిమాండ్ అమాంతం పెరిగింది. ముఖ్యంగా ప్రజలు పెరుగుతున్న పెట్రోల్ ధరల నుంచి రక్షణకు ఈవీ స్కూటర్లను ఆశ్రయిస్తున్నారు. అలాగే ప్రభుత్వాలు కూడా పెరుగుతున్న కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు ఈవీ వాహనాలను ప్రోత్సహిస్తున్నాయి. దీంతో టాప్ కంపెనీల నుంచి స్టార్టప్ కంపెనీల వరకూ ఈవీ స్కూటర్లను లాంచ్ చేస్తున్నాయి. ప్రముఖ కంపెనీ ఆంపియర్ తన కొత్త ప్రీమియం స్కూటర్లు నెక్సస్ ఈఎక్స్, నెక్సస్ ఎస్‌టీ భారత మార్కెట్లో విడుదల చేసింది. ఈ కొత్త మోడల్లు భారతదేశంలోని బ్రాండ్ మోడల్ లైనప్‌లో అగ్రస్థానంలో ఉంటాయి. నిర్దిష్టంగా చెప్పాలంటే నెక్సస్ ఈఎస్ రూ. 1.20 లక్షలకు (ఎక్స్-షోరూమ్) విక్రయించబడుతుంది. అయితే బ్రాండ్ దీనిని రూ. 1.10 లక్షల (ఎక్స్-షోరూమ్) ప్రారంభ ధరతో అందిస్తోంది. అదేవిధంగా నెక్సస్ ఎస్‌టీ రూ. 1.30 లక్షలు (ఎక్స్-షోరూమ్) వద్ద విక్రయించబడుతుంది, అయితే ప్రారంభ ధర రూ. 1.20 లక్షలు (ఎక్స్-షోరూమ్)గా ఉంది. అయితే ఈ రెండు స్కూటర్ల ఫీచర్ల గురించి వివరాలను తెలుసుకుందాం. ఆంపియర్ నెక్సస్ స్కూటర్లు ఆధునిక డిజైన్‌తో ఆకట్టుకునే విధంగా ఉంటాయి. ఈ స్కూటర్ ఫ్రంట్ ఎండ్ ఒక ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్, డీఆర్ఎల్‌ను కోణీయ డిజైన్‌తో వస్తుంది. అలాగే ఈ స్కూటర్ ఫోర్‌బోర్డ్‌లో మంచి స్థలంతో మంచి సిటింగ్ స్థలాన్ని అందిస్తుంది. 1,319 ఎంఎం వీల్ బేస్‌తో వచ్చే ఈ స్కూటర్ 712 ఎంఎం సీటు పొడవుతో 235 ఎంఎం ఫ్లోర్‌బోర్డ్ స్థలంతో వస్తుంది. ముఖ్యంగా ఈ స్కూటర్ 170 ఎంఎం గ్రౌండ్ క్లియరెన్స్ కలిగి ఉంది. ఆంపియర్ నెక్సస్ ఎస్‌టీ వెర్షన్‌లో 7 అంగుళాల టీఎఫ్‌టీ స్క్రీన్‌తో వస్తుంది. అయితే ఈఎక్స్ 6.2 అంగుళాల పీఎంవీఏ ఆకర్షణీయంగా ఉంటుంది. ముఖ్యంగా ఈ స్క్రీన్ బ్లూటూత్ కనెక్టివిటీని అందిస్తుంది. అలాగే ఈ స్కూటర్ ఐదు రైడింగ్ మోడ్లను కూడా అందిస్తుంది. ఎకో, సిటీ, పవర్, లింప్ హెరీమ్, రివర్స్ మోడ్‌తో ఈ స్కూటర్లు అందుబాటులో ఉంటాయి. ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ హైడ్రాలిక్ టెలిస్కోపిక్ సస్పెన్షన్‌తో వస్తుంది. అలాగే వెనుక భాగంలో డ్యూయల్ షాక్ అబ్జార్బర్లు ఉన్నాయి. ఫ్రంట్ ఎండ్ డిస్క్ బ్రేక్‌తో పాటు వెనుక భాగంలో డ్రమ్ బ్రేక్‌తో వస్తుంది.

# స్పోర్ట్స్

## టీ20 వరల్డ్‌కప్‌కు అంపైర్‌లు వీరే..

# భారత్ నుంచి ఇద్దరు



టీ20 వరల్డ్‌కప్-2024కు అమెరికా-వెస్టిండీస్‌లకు సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న సంగతి తెలిసిందే. జూన్ 2 న చెన్నై వేదికగా అమెరికా-కెనడా మధ్య జరగనున్న మ్యాచ్‌తో ఈ మెగా ఈవెంట్‌కు తెరలేవనుంది. ఈ క్రమంలో ఈ మెగా టోర్నీకోసం 20 మందితో కూడిన అంపైర్స్ జాబితాను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) విడుదల చేసింది. ఈ జాబితాలో ఐసీసీ ఎమిరేట్స్ ఎలైట్ ప్యానెల్‌లో సభ్యత్వం పొందిన అంపైర్‌లు 16 మంది, ఎమర్జింగ్ ప్యానెల్‌లోని నలుగురు అంపైర్‌లు ఉన్నారు. ఈ లిస్టులో భారత్ నుంచి నితిన్ మీనన్, జయరామన్ మదనగోపాల్‌కు చోటు దక్కింది. కాగా మదనగోపాల్‌కు ఐసీసీ ఈవెంట్‌లో అంపైరింగ్ చేసే అవకాశం రావడం ఇదే మొదటిసారి. అతడితో పాటు సామ్ నోగాజ్‌స్కీ, అల్లావుడియన్ పాలేకర్, రషీద్ రియాజ్, ఆసిఫ్ యాకూబ్‌లు సైతం తొలిసారి ఐసీసీ ఈవెంట్‌లో అంపైర్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. అదే విధంగా 2022 టీ20 వరల్డ్‌కప్ ఫైనల్‌లో అంపైర్‌లుగా వ్యవహరించిన కుమార్ ధర్మసేన, క్రిస్ గఫానీ, పాల్ రీఫిల్ కూడా ఈ లిస్టులో ఉన్నారు.

మరోవైపు ఈ ప్రధాన టోర్నీ కోసం మ్యాచ్ రిఫరీల జాబితాను కూడా ఐసీసీ ప్రకటించింది. డేవిడ్ బూన్, జెఫ్ క్రోవ్, రంజన్ మడుగల్లె, ఆండీ పైక్రాఫ్ట్, రిచీ రిచర్డ్‌సన్, జవగల్ శ్రీనాథ్‌లను మ్యాచ్ రిఫరీలగా ఐసీసీ నియమించింది.

**వరల్డ్‌కప్‌కు అంపైర్‌లు వీరే..**

క్రిస్ బ్రౌన్, కుమార్ ధర్మసేన, క్రిస్ గఫానీ, మైఖేల్ గోఫ్, అడ్రియన్ హెూల్డ్‌స్టాక్, రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, అల్లాహుడియన్ పాలేకర్, రిచర్డ్ కెటిల్‌బరో, జయరామన్ మదనగోపాల్, నితిన్ మీనన్, సామ్ నోగాజ్‌స్కీ, అహ్సాన్ రజా, రషీద్ రియాజ్, పాల్ రూసికా రీఫెల్, లాంగ్టన్ రుసెరే, రోడ్నీ టక్కర్, అలెక్స్ వార్ఫ్, జోయెల్ విల్సన్, ఆసిఫ్ యాకూబ్.

**మ్యాచ్ రిఫరీలు:** డేవిడ్ బూన్, జెఫ్ క్రోవ్, రంజన్ మడుగల్లె, ఆండ్రూ పైక్రాఫ్ట్, రిచీ రిచర్డ్‌సన్, జవగల్ శ్రీనాథ్.

## ఒకవేళ రోహిత్ దూరమైతే: భారత మాజీ స్టార్ షాకింగ్ కామెంట్స్



టీ20 ప్రపంచకప్-2024 నేపథ్యంలో టీమిండియా మాజీ క్రికెటర్ ప్రజ్ఞాన్ ఓజా కీలక వ్యాఖ్యలు చేశాడు. హార్దిక్ పాండ్యా నైపుణ్యాలపై సందేహాలు అక్కర్లేదని.. కెప్టెన్‌గానూ జట్టును ముందుకు నడిపించగల సత్తా అతడికి ఉందని పేర్కొన్నాడు. ఒకవేళ రోహిత్ శర్మ ఏదేని కారణాల చేత ఐసీసీ టోర్నీ మ్యాచ్‌లకు దూరమైతే.. సారథ్య బాధ్యతలు చేపట్టేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని పాండ్యాకు సూచించాడు. ఐపీఎల్ వైఫల్యాలు మరిచి వరల్డ్‌కప్‌నకు రెడీగా ఉండాలని ఓజా చెప్పుకొచ్చాడు.

కాగా వన్డే వరల్డ్‌కప్-2023లో బంగ్లాదేశ్‌తో మ్యాచ్ సందర్భంగా గాయపడ్డ పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా.. అప్పటి నుంచి భారత జట్టుకు దూరమయ్యాడు. చీలమండ గాయం నుంచి కోలుకుని ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా ఐపీఎల్-2024 బరిలో దిగాడు. అయితే, ఆశించిన స్థాయిలో రాణించకపోలేతున్న పాండ్యా కెప్టెన్‌గా, ఆటగాడిగా విఫలమవుతున్నాడు. అతడి సారథ్యంలో ముంబై ఇప్పటి వరకు పది మ్యాచ్‌లు ఆడి కేవలం మూడే గెలిచిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఈ నేపథ్యంలో టీ20 ప్రపంచకప్ జట్టులో అతడికి స్థానమే ఇవ్వకూడదనే డిమాండ్లు వినిపించాయి. అయితే, బీసీసీఐ మాత్రం మెగా ఈవెంట్లో ఏకంగా కెప్టెన్ రోహిత్ శర్మకు డిప్యూటీగా హార్దిక్ పాండ్యాను ఎంపిక చేసింది. ఈ క్రమంలో భారత మాజీ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా హార్దిక్ పాండ్యాను ఉద్దేశించి మాట్లాడుతూ.. "అతడు నిజమైన నాయకుడిగా బరిలోకి దిగాలని నేను కోరుకుంటున్నా. ఒకవేళ రోహిత్‌కు ఏమైనా జరిగితే.. అలా జరగాలని మనం కోరుకోము. కానీ పరిస్థితుల ప్రభావం వల్ల అతడు జట్టు దూరమైతే హార్దిక్ పాండ్యానే జట్టును ముందుకు నడిపించాలి కదా. కాబట్టి హార్దిక్ అందుకు అన్ని వేళలా సన్నద్ధంగా ఉండాలి.

బ్యాటర్‌గానూ మరింత బాధ్యతాయుతంగా ఆడాలి. నిజానికి అతడు ఉంటేనే జట్టు సమతూకంగా ఉంటుంది. టీమిండియా సెలక్షన్ గురించి ఎవరు మాట్లాడినా తొలుత హార్దిక్ పేరే గుర్తుకువస్తుంది. అవసరమైన వేళ అదనపు బ్యాటర్‌గా.. బౌలర్‌గా తను సేవలు అందించగలడు. ఐపీఎల్‌లో ఏం జరుగుతుందన్న విషయం గురించి పక్కనపెట్టి వరల్డ్‌కప్ పైన శ్రద్ధ పెట్టాలి. అవసరమైతే కెప్టెన్‌గానూ జట్టును ముందుకు నడిపించడానికి హార్దిక్ పాండ్యా సన్నద్ధంగా ఉండాలి" అని సూచించాడు.

కాగా అమెరికా- వెస్టిండీస్ సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న టీ20 ప్రపంచకప్ టోర్నీ జూన్ 1న మొదలుకానుంది. టీమిండియా జూన్ ఐదున తమ తొలి మ్యాచ్‌లో ఐర్లాండ్‌తో తలపడుతుంది.

## కేఎల్ రాహుల్‌కు బదులుగా సంజూ శాంసన్‌కు ప్రియార్టీ.. ఎందుకో చెప్పిన చీఫ్ సెలెక్టర్




ముంబై: టీ20 వరల్డ్‌కప్ కోసం ప్రకటించిన జట్టులో సంజూ శాంసన్‌కు చోటు దక్కింది. అయితే బ్యాటర్ కేఎల్ రాహుల్‌ను కాదు అని, అతని స్థానంలో సంజూకు అవకాశం ఇచ్చారు. దీనిపై బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ వివరణ ఇచ్చారు. మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేసేవాళ్ల కోసం చూశామని, అందుకే కేరళ కెప్టెన్ సంజూకు రెండో వికెట్ కీపర్‌గా అవకాశం ఇచ్చినట్లు అగార్కర్ తెలిపాడు. కేఎల్ రాహుల్ అద్భుతమైన బ్యాటర్ అని, కానీ తాము మిడిల్ ఆర్డర్ బ్యాటర్ కోసం వెతుకుతున్నామని, కేఎల్ ప్రస్తుతం టాప్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేస్తున్నట్లు అగార్కర్ చెప్పాడు. లోయర్ ఆర్డర్‌లో వచ్చి ఆడే సత్తా సంజూకు ఉన్నట్లు భావిస్తున్నామని పేర్కొన్నారు. రిషబ్ పంత్ బ్యాటింగ్ ఆర్డర్‌లో అయిదో స్థానంలో ఆడుతున్నాడని అజిత్ తెలిపారు. ఎవరు ఉత్తమ బ్యాటర్ అన్న విషయాన్ని ఆలోచించడం లేదని, ఈ ఇద్దరూ బెస్ట్ బ్యాటర్స్ అని, కానీ వరల్డ్‌కప్‌లో లోయర్ ఆర్డర్‌లో ఆడేవాళ్లు కావాలని అగార్కర్ తెలిపాడు. హార్దిక్ పాండ్యాను జట్టులోకి తీసుకోవడాన్ని అగార్కర్ సమర్థించుకున్నాడు.

# ప్రభాస్ హీరోయిన్‌ను పట్టేసిన సిద్ధు?



సిద్ధు జొన్నలగడ్డ.. గత కొంతకాలం నుంచి టాలీవుడ్ ఇండస్ట్రీలో మారుమోగిపోతున్న పేరు. బిజెపిలో అనే సినిమాను తీసి సెన్సేషనల్ విజయాన్ని సొంతం చేసుకున్నాడు సిద్ధ జొన్నలగడ్డ.అప్పటివరకు మిగతా హీరోల సినిమాలలో చిన్నచితక పాత్రలు మాత్రమే చేసుకుంటూ వచ్చిన సిద్ధు.. ఇక డీజే టిల్లు మూవీతో క్రేజీ హీరోగా మారిపోయాడు. యూత్ అందరిలో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్నాడు అని చెప్పాలి. అయితే తనకు కలిసి వచ్చిన డీజే టిల్లు సినిమాకి సీక్వెల్ తీసి మరోసారి బ్లాక్ బస్టర్ కొట్టాడు. టాలీవుడ్ చిత్ర పరిశ్రమలో 100 కోట్ల వసూళ్లు సాధించిన హీరోగా మారిపోయాడు సిద్ధు జొన్నలగడ్డ. ఇక ఇటీవల విడుదలైన టిల్లు స్క్వేర్ అనే సినిమాలో సిద్ధు జొన్నలగడ్డ సరసన అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్గా నటించింది. ఏకంగా బోల్డ్ పాత్రల్లో కూడా అద్భుతంగా నటించి ప్రేక్షకులను సర్ ప్రైజ్ చేసింది ఈ ముద్దుగుమ్మ. అయితే ఇప్పుడు టిల్లు స్క్వేర్ సినిమా కూడా సూపర్ హిట్ కావడంతో ఇక టిల్లు క్యూబ్ అనే మూవీ తీసేందుకు రెడీ అవుతున్నాడు. ఇక ఈ సినిమాపై కూడా భారీ రేంజ్ లోనే అంచనాలు ఉన్నాయి అన్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమాలో ఎవరు హీరోయిన్ గా సెలెక్ట్ అవుతారు అన్నది హాట్ టాపిక్ గా మారిపోయింది. అయితే టిల్లు క్యూబ్ మూవీ కోసం అటు సిద్ధు జొన్నలగడ్డ ఒక స్టార్ హీరోయిన్ పట్టేశాడు అనేది తెలుస్తుంది. టాలీవుడ్ చిత్ర పరిశ్రమలో మహేష్ బాబు, రామ్ చరణ్, అల్లు అర్జున్, తారక్, ప్రభాస్ లాంటి టాప్ హీరోలతో నటించిన పూజ ఇక సిద్ధు జొన్నలగడ్డ సరసన టిల్లు క్యూబ్ మూవీలో నటించబోతున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ విషయంపై ఇప్పటికే చర్చలు జరపగా.. పూజ ఓకే చెప్పేసిందట. త్వరలోనే ఈ విషయంపై అఫీషియల్ ప్రకటన కూడా రాబోతుంది అన్నది తెలుస్తుంది.


# నా బాడీ సూపర్ డీలక్స్

## 'యేవమ్' నుంచి అషు రెడ్డి ఫస్ట్ లుక్ విడుదల

యువ నటుడు నవదీప్ తన సొంత నిర్మాణ సంస్థ సి-స్పేస్ ప్రొడక్షన్స్ పతాకంపై 'యేవమ్' అనే సినిమా నిర్మిస్తున్న విషయం తెలిసిందే. చాందిని చౌదరి ప్రధాన పాత్రలో వస్తున్న ఈ చిత్రంలో వశిష్ట సింహా, జైభారత్, ఆషురెడ్డి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు ప్రకాష్ దంతులూరి దర్శకత్వం వహిస్తుండగా.. నవదీప్, పవన్ గోపరాజు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి చాందిని చౌదరి ఫస్ట్ లుక్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. "ఆడపిల్లనే! ఐతే ఏంటంట?" అంటూ పోలీసుగా సీరియస్ లుక్‌లో చాందిని ఉండగా.. మహిళా సాధికారికతను చాటి చెప్పే విధంగా చాందిని పాత్ర ఈ చిత్రంలో కనిపించనుంది. ఇదిలావుంటే తాజాగా మూవీ నుంచి మరో కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ మూవీ నుంచి అషు రెడ్డి ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. నా బాడీ సూపర్ డీలక్స్ అంటూ ఈ పోస్టర్ ఉండగా.. హారిక అనే బోల్డ్ పాత్రలో అషు రెడ్డి నటించబోతున్నట్లు తెలుస్తుంది. చాందిని చౌదరి, వశిష్ట సింహా, జైభారత్, ఆషురెడ్డి, గోపరాజు రమణ, దేవిప్రసాద్, కల్పిత తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫర్క్ష్మ ఎస్‌వీ విశ్వేశ్వర్, సంగీతం కీర్తన శేషు, నీలేష్ మందలపు అందిస్తున్నారు. సుజనా అడుసుమిల్లి ఎడిటర్‌గా, రాజు పెన్మెత్స ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.




# రాజమౌళి - మహేష్ సినిమా సెట్స్ పైకి వెళ్ళేది అప్పుడే!



దర్శక దిగ్గజం ఎస్ఎస్ రాజమౌళి గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. బాహుబలి, ఆర్ఆర్ఆర్ సినిమాలతో తెలుగు సినిమా రేంజ్‌ను హాలీవుడ్ వరకు తీసుకెళ్లాడు. ఇక ఆర్ఆర్ఆర్ సినిమా తర్వాత రాజమౌళి సినిమా ఎప్పుడు ఉంటుందా ఎప్పుడెప్పుడు చూద్దామా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే టాలీవుడ్ హీరో మహేశ్‌బాబుతో సినిమా చేయనున్నట్లు రాజమౌళి ప్రకటించాడు. ఎస్ఎస్ఎంబీ 29గా వస్తున్న ఈ ప్రాజెక్ట్ హాలీవుడ్ స్థాయికి ఏ మాత్రం తగ్గకుండా ఉంటుందని రాజమౌళి అప్పట్లో వెల్లడించాడు. అయితే ఈ ప్రాజెక్ట్ ఎప్పుడు స్టార్ట్ కాబోతుందనే దానిపై మాత్రం క్లారిటీ ఇవ్వలేదు జక్కన్న. ఇదిలావుంటే తాజాగా ఈ మూవీ షూటింగ్‌పై సాలిడ్ అప్‌డేట్ ఇచ్చాడు నిర్మాత కె.ఎల్.నారాయణ. ఈ మూవీ షూటింగ్‌పై కె.ఎల్.నారాయణ మాట్లాడుతూ.. ప్రస్తుతం స్క్రిప్ట్ దశలో ఉంది. గత కొన్ని నెలలుగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అన్ని అనుకున్నట్లు జరిగితే ఆగస్టు లేదా సెప్టెంబరులో షూటింగ్ మొదలు కావొచ్చు. ఈ సినిమా స్టోరీ చాలా బాగుంది. బడ్జెట్ ఎంత అన్నది ఇంకా డిసైడ్ అవ్వలేదు. కానీ ఎంత అవసరమైన పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాం అంటూ నిర్మాత కె.ఎల్.నారాయణ చెప్పుకొచ్చారు. ఇక ఈ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌కు వి.విజయేంద్ర ప్రసాద్ కథను అందిస్తుండగా.. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం, పి.ఎస్.వినోద్ సినిమాటోగ్రఫీ.. వీఎఫ్ఎక్స్ సూపర్ వైజర్గా ఆర్.సి.కమల్ కణ్ణన్, ప్రొడక్షన్ డిజైనర్గా మోహన్ బింగి, ఎడిటర్గా తమ్మిరాజు, కాస్ట్యూమ్ డిజైనర్ %డ% స్టైలిస్ట్‌గా రమా రాజమౌళి పని చేయనున్నట్లు సమాచారం. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. వచ్చే నెలలో మూవీ కూడా లాంచ్ అవ్వనున్నట్లు తెలుస్తుంది. ఇండోనేషియాకు చెందిన హీరోయిన్ చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ ఇందులో హీరోయిన్గా నటించే అవకాశాలున్నాయని సమాచారం.

# ఆ మూవీ చూశాక ఆ పని చేయడం ఆపేసా



మోస్ట్ బ్యూటిఫుల్ అండ్ వెరీ టాలెంటెడ్ నటిమని మిల్కీ బ్యూటీతమన్నా గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈమె శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందిన హ్యాపీ డేస్మూవీ తో అద్భుతమైన విజయాన్ని అందుకొని తెలుగు సినీ పరిశ్రమలో సూపర్ క్రేజ్ ను సంపాదించుకుంది. ఇక ఆ తర్వాత నుండి ఈమెకు వరుసగా టాలీవుడ్ ఇండస్ట్రీ లో క్రేజీ సినిమా అవకాశాలు దక్కాయి. అందులో భాగంగా టాలీవుడ్ ఇండస్ట్రీ లో ఉన్న దాదాపు అందరూ స్టార్ హీరోల సరసన నటించిన తమన్నా ఇప్పటికీ కూడా తెలుగు లో మంచి గుర్తింపు కలిగిన హీరోయిన్ గా కెరియర్ ను ముందుకు సాగిస్తుంది. ఇకపోతే తాజాగా ఈ బ్యూటీ తమిళ్ లో రూపొందిన "అరుణ్మనై 4" అనే సినిమాలో కీలక పాత్రలో నటించింది ఈ మూవీ మే 3 వ తేదీన విడుదల కానుంది. ఈ సినిమా తమిళ్ తో పాటు తెలుగు లో కూడా విడుదల కానుంది. తెలుగు లో ఈ సినిమా "బాక్" అనే టైటిల్ తో విడుదల కానుంది. ఈ మూవీ తెలుగు వర్షన్ ను కూడా మే 3 వ తేదీనే రిలీజ్ కానుంది. ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడడంతో తమన్నా వరుస ఇంటర్వ్యూ లలో పాల్గొంటూ ఈ సినిమాను ప్రమోట్ చేస్తుంది. అందులో భాగంగా తాజాగా ఈ బ్యూటీ ఇంటర్వ్యూ లో పాల్గొంది. ఆ ఇంటర్వ్యూ లో భాగంగా తమన్న ఓ సినిమా చూశాక తనకున్న ఒక అలవాటును పూర్తిగా మానేసినట్లు చెప్పుకొచ్చింది. తాజా ఇంటర్వ్యూలో తమన్నా మాట్లాడుతూ ... హాలీవుడ్సినిమాహౌస్ ఆఫ్ వ్యాక్స్ చూశాక చర్మం పై రోమాలు తొలగించడం పూర్తిగా మానేశాను అని చెప్పింది. ఆ సినిమాలో వ్యాక్స్ తో పలు రకాలుగా చంపేస్తారు అని , ఆ మూవీ తర్వాత నుండి చర్మంపై రోమాలను తొలగించడం మానివేసినట్లు మిల్కీ బ్యూటీ తాజా ఇంటర్వ్యూ లో భాగంగా చెప్పింది.

# 100వ సినిమా కోసం నాగార్జున రిస్క్ చేస్తున్నాడా?



అక్కినేని నట వారసుడిగా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన నాగార్జున ప్రస్తుతం ఇండస్ట్రీలో టాప్ హీరోగా కొనసాగుతున్నాడు. అయితే కెరీర్ మొదట్లో కొన్ని స్ట్రగుల్స్ ఎదుర్కొన్నప్పటికీ నాగార్జున వాటన్నింటిని దాటుకొని తనలో ఉన్న నటుడిని బయటకి తీస్తూ సూపర్ సక్సెస్ లను అందుకున్నాడు.ఇక అప్పటినుంచి ఇప్పటివరకు ఆయన ఒక్కసారి కూడా వెనుతిరిగి చూడకుండా వరుస సినిమాలను చేస్తూ ముందుకు దూసుకెళు _న్నాడు. మరి ఇలాంటి క్రమంలో ఆయన చేస్తున్న సినిమాలు మంచి విజయాలను సాధిస్తాయా లేదా అనే విషయం లో కూడా ఆయన అభిమానుల్లో పలు రకాల ప్రశ్నలైతే మెదులుతున్నాయి. ఎందుకంటే రీసెంట్ గా ఆయన 'నా సామి రంగా' అనే సినిమాతో సంక్రాంతి కానుక గా ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. అయితే ఈ సినిమా అనుకున్న రేంజ్ లో సక్సెస్ సాధించలేదు. ఇప్పుడు నాగార్జున తన వందో సినిమా ఎవరితో చేయాలనే దానిమీద చాలా కసరత్తులైతే చేస్తున్నాడు. ఇక దాదాపు సంవత్సరం నుంచి తన వందో సినిమా దర్శకుడి కోసం వెతుకుతూనే ఉన్నాడు. ఇక కొంత మంది దర్శకుల పేర్లు తెర పైకి వచ్చినప్పటికీ ఎప్పటికప్పుడు మళ్ళీ అందరూ కూడా కనుమరుగై పోతున్నారు. ఇక మొత్తానికైతే ఇప్పుడు ఆయన వందో సినిమా కోసం ఒక కొత్త దర్శకుడికి అవకాశం ఇవ్వబోతున్నట్టుగా తెలుస్తుంది. ఎందుకంటే ఆయన చెప్పిన కాన్సెప్ట్ నచ్చి ఒక తన వందో సినిమాను ఆయన చేతుల్లో పెడుతున్నాడట.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com